టైమ్స్ ఆఫ్ వార్త

తెలుగు దినపత్రిక

ఎడిటర్ : గూడూరు జనార్ధన్ రెడ్డి

తెలంగాణ | మంగళవారం, 28 - మే - 2024 | సంపుటి : 16 | సంచిక : 315 | పేజీలు 06 | వెల : 6/-

ఎమ్మెల్సీ ఎన్నిక ప్రశాంతం

సాయంత్రం 4 గంటల వరకు 68.65 శాతం పోలింగ్

బ్యాలెట్ బాక్స్‌ల్లో నేతల భవితవ్యం.. జూన్ 5న ఫలితం

టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. సాయంత్రం 4 గంటల వరకు 68.65 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ సమయం ముగిసినప్పటికీ వరుసలో ఉన్న వారికి ఓటేసేందుకు అధికారులు అనుమతించారు. వారి ఓటింగ్ పూర్తయితే పోలింగ్ శాతం మరింత పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. సోమవారం అర్ధరాత్రి వరకు కచ్చితమైన సమాచారం తెలుస్తుందని ఎన్నికల సంఘం తెలిపింది. ఉదయం మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ 11 గంటల నుంచి ఊపందుకుంది. మొదటి రెండు గంటల్లో 11.34 శాతం పోలింగ్ నమోదు కాగా, ఆ తర్వాత వేగం పుంజుకుంది. మధ్యాహ్నం 12 గంటలకు 29.30 శాతం, మధ్యాహ్నం 2 గంటలకు 49.53 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ అనంతరం భారీ బందోబస్తు నడుమ బ్యాలెట్ బాక్స్‌లను నల్లగొండలోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న, బీఆర్ఎస్ నుంచి ఏనుగుల రాకేష్ రెడ్డి, బీజేపీ నుంచి ప్రేమేందర్ రెడ్డి పోటీ చేశారు. వారితో పాటు 39 మంది ఇండిపెండెంట్లతో కలిపి మొత్తం 52 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు.

సాయంత్రం 4 గంటల వరకు 68.65 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ సమయం ముగిసినప్పటికీ ఎన్నిక ఫలితాన్ని జూన్ 5వ తేదీన వెల్లడించనున్నారు.

అక్రమంగా ఇన్సులిన్ అమ్మకాలు

టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

అక్రమంగా ఇన్సులిన్ అమ్మకాలు కొనసాగిస్తున్న వారిపై డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డిసిఎ) కొరడా ఝుళిపించింది. కొనుగోలు బిల్లులు లేకుండా అక్రమంగా ఇన్సులిన్ ఇంజెక్షన్లు కొనుగోలు చేసిన ఆరుగురు మెడికల్ హోల్‌సేల్ వ్యాపారుల లైసెన్సులను 30 రోజుల పాటు డిసిఎ సస్పెండ్ చేసింది. రూ.51.92 లక్షల విలువైన నిల్వలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు మార్చి 15 నుంచి మార్చి 20 మధ్య హైదరాబాద్‌లోని ఆరు మెడికల్ డిస్ట్రిబ్యూటర్లపై డిసిఎ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో ఇన్సులిన్ ఇంజెక్షన్లను 40 శాతానికి మించి రాయితీపై విక్రయిస్తున్నట్లు గుర్తించారు. కొనుగోలు బిల్లులు లేకుండానే ఈ ఇంజెక్షన్లు న్యూఢిల్లీ నుంచి వచ్చాయి. ఈ దాడుల్లో డిసిఎ రూ.51.92 లక్షల విలువైన నిల్వలను స్వాధీనం చేసుకుంది. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్, 1940ని ఉల్లంఘించే కొనుగోలు బిల్లులు లేకపోవడం వల్ల ఇన్సులిన్ ఇంజెక్షన్‌లపై గణనీయమైన తగ్గింపును అందిస్తున్నట్లు టోకు వ్యాపారులు గుర్తించారు. కొను గోలు బిల్లులు లేకుండా నిల్వ ఉంచిన సికింద్రాబాద్‌లోని మెస్సర్స్ డ్రగ్ హబ్ నుంచి రూ.6.70 లక్షలు, రామంతాపూర్, ఉప్పల్‌లోని శ్రీ తిరుమల ఫార్మా నుంచి రూ.3.52 లక్షలు, హైదరాబాద్‌లోని సుల్తాన్ బజార్‌లోని శ్రీ పరాస్ మెడికల్ ఏజెన్సీ నుంచి రూ. 9 లక్షలు, - మేడ్చల్-మల్కాజి గిరి జిల్లాలో శ్రీ గణేష్ ఫార్మా డిస్ట్రిబ్యూటర్స్ రూ. 14 లక్షలు, -కాప్రాలోని శ్రీరాజ రాజేశ్వర డిస్ట్రిబ్యూటర్లు నుంచి రూ. 2.70 లక్షలు,- హైదరా బాద్‌లోని కాచిగూడలోని శ్రీ బాలాజీ ఏజెన్సీస్

మిగతా 6లో..

దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీకి వచ్చేది

20 సీట్ల కంటే తక్కువే

గుజరాత్, హరియాణా, ఢిల్లీ, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఈసారి సగం కూడా కష్టమే

పాకిస్థాన్‌లోనూ పోటీ చేస్తేనే 400 వచ్చేది.. రాజ్యాంగం మార్పు, రిజర్వేషన్ల రద్దుకే 400

ప్రధాని హోదాలో దేశంలోని కొంతమందికి వ్యతిరేకంగా మాట్లాడడం మంచిది కాదు

కేరళలో పుస్తకావిష్కరణలో సీఎం రేవంత్ రెడ్డి

టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

"లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమికి దక్షిణాది రాష్ట్రాలు వందకుపైగా సీట్లు ఇవ్వనున్నాయి. దక్షిణాదిలో మొత్తం 121 సీట్లు ఉంటే.. కేరళ, తమిళనాడుల్లో బీజేపీకి చోటే లేదు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో ఆ పార్టీకి వచ్చే సీట్లు 20 కంటే తక్కువే. గత ఎన్నికల్లో బీజేపీకి గుజరాత్, హరియాణా, ఢిల్లీ, రాజస్థాన్‌లలో మొత్తం సీట్లు వచ్చాయి. ఈసారి ఆయా రాష్ట్రాల్లో సగం సీట్లు కూడా రావు. మరి, ఆ పార్టీకి ఈ ఎన్నికల్లో 400 సీట్లు ఇంకెక్కడి నుంచి వస్తాయి!?" అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఆ పార్టీ నేతలు కోరుకున్నట్లు 400 సీట్లు కావాలంటే పాకిస్థాన్ ఎన్నికల్లోనూ పోటీ చేయాలని ఎద్దేవా చేశారు. మోదీకి ప్రజలు రెండు సార్లు అధికారం ఇస్తే.. ఆయన వారిని మోసం చేశారని, దేశ ప్రజలంతా ఒక్కటై ఈ ఎన్నికల్లో బీజేపీని ఓడిస్తారని తేల్చి చెప్పారు. సయ్యద్ సాదిక్ అలీ షిహాబ్ తంగల్ రాసిన 'స్నేహ సదస్సు' పుస్తకావిష్కరణ కార్యక్రమం సోమవారం కేరళలోని కొజికోడ్‌లో ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్ రెడ్డి.. స్నేహ సదస్సు పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో మతతత్వ శక్తులు మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజలకు, రాజ్యాంగానికి, రిజర్వేషన్లకు ప్రమాదకరమన్నారు. "ఈ

ఎన్నికల్లో మతతత్వ శక్తులు 400 సీట్లు అడిగేది రాజ్యాంగాన్ని మార్చి.. రిజర్వేషన్లను రద్దు చేసేందుకే. అందరమూ కలిసి మతతత్వ శక్తులను ఓడించి.. రాజ్యాంగాన్ని రక్షించే బాధ్యత తీసుకోవాలి. మతతత్వ శక్తులను కేరళ ప్రజలు వారి రాష్ట్రంలోకి అనుమతించరు. మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా పోరాడుతున్న వారితో కలిసి ఈ వేదిక పంచుకుంటున్నందుకు గర్వపడుతున్నాను" అని వ్యాఖ్యానించారు. ఒక విషయంలో కేరళను చూస్తే ఈర్ష్య కూడా కలుగుతుందని, రాహుల్ గాంధీని తెలంగాణ నుంచి పోటీ చేయించేందుకు ఎంతగానో ప్రయత్నించానని, కానీ, కేరళ తన కుటుంబమని, తాను ఈసారీ

మిగతా 6లో..

ఐదు రోజుల్లో కేరళకు రుతుపవనాలు

టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

ఎండలతో అల్లాడిపోతు న్న ప్రజలకు భారత వాతావరణశాఖ చల్లటి కబురందించింది. వచ్చే 5 రోజుల్లో కేరళలో రుతుపవనాలు ప్రవేశించడానికి అన్ని విధాలుగా అనుకూలమైన వాతావరణం ఉందని ఐఎండీ వెల్లడించింది. మే 31కి ఒకటీ రెండు రోజులు అటుఇటుగా నైరుతి రుతుపవనాలు కేర ళ తీరాన్ని తాకనున్నట్లు ప్రకటించింది. లానినా ప్రభావంతో ఈసారి ఆగస్టు-సెప్టెంబరు కాలంలో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదు కావొచ్చని గత నెలలో వాతావరణ శాఖ పేర్కొంది. అందుకు అనుగుణంగానే రుతుపవనాల కదలిక ఉందని తెలిపింది. భారత వాతవరణ శాఖ ప్రకారం కేరళలో రుతుపవనాలు ప్రవేశించే సమయం గత 150 సంవత్సరాలుగా మారుతూనే ఉంది. మొదటిసారి ముందుగా 1918లో మే 11నే ప్రవేశించాయి. అత్యంత ఆలస్యంగా 1972 జూన్ 18న ప్రవేశించాయి. ఇక గతేడాది జూన్8న, 2022లో మే 29న, 2021లో జూన్ 3న, 2020లో జూన్1న నైరుతి రుతుపవనాలు కేరళ తీరానికి తాకాయి.

తెలంగాణలో తేలికపాటి వర్షం

కిందిస్థాయిలో గాలులు పడమర, వాయువ్యదిశల నుం చి రాష్ట్రంలోకి వీస్తున్నాయి. రాష్ట్రంలో అక్కడక్కడా తేలిక పాటి వర్షాలు కురిశాయి. గరిష్టంగా నారాయణఖేడ్‌లో 14.5 మి.మి

మిగతా 6లో..

జూన్ రెండున కార్నివాల్

అన్ని కళారూపాలతో పెద్ద ఎత్తున ప్రదర్శనలు

ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష

ఐదు వేల మంది పోలీసులతో బ్యాండ్ ప్రదర్శన

ట్యాంక్‌బండ్‌పై 80 స్టాళ్ల ఏర్పాటు

ఘనంగా రాష్ట్రావతరణ వేడుకలు

పరేడ్ మైదానంలో రాష్ట్ర గీతాన్ని ఆవిష్కరించనున్న సీఎం

టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

రాష్ట్ర అవతరణ ఉత్సవాల సందర్భంగా జూన్ రెండున హైదరాబాద్ లోని ట్యాంక్‌బండ్‌పై రాత్రి 7 నుంచి 9 గంటల వరకు అన్ని రకాల కళారూపా లతో పెద్ద ఎత్తున కార్నివాల్‌ను నిర్వహించనున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వెల్లడించారు. అదే రోజు శిక్షణ పొందిన ఐదు వేల మంది పోలీసు అధికారులు బ్యాండ్ ప్రదర్శనలో పాల్గొంటారని ఆమె తెలిపారు. ట్యాంక్‌బండ్‌పై దాదాపు 80

రకాల స్టాళ్లను ఏర్పాటు చేస్తామని వివరించారు. హస్త కళలు, చేనేత, స్వయం సహాయక బృందాలు తయారు చేసిన వస్తువులతోపాటు నగరంలో పేరొందిన హోటళ్ల ద్వారా ఫుడ్ స్టాళ్లను కూడా ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్రావతరణ దినోత్సవ ఏర్పాట్లపై సోమవారం హైదరాబాద్ లోని సచివాలయంలో సీఎస్ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. జూన్ రెండున ఉదయం గన్ పార్కులోని అమరవీరుల స్థూపానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాళులర్పిస్తారని చెప్పారు. అనంతరం సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో నిర్వహించే కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని వివరించారు. ఆ సందర్భంగా సీఎం రాష్ట్ర గీతాన్ని ఆవిష్కరించి, ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారని తెలిపారు. అదేరోజు రాత్రి ట్యాంక్‌బండ్‌పై నిర్వహించే వేడుక లకు హాజరయ్యే పౌరులు, పిల్లల కోసం పలు క్రీడలతో కూడిన వినోదశాలను కూడా ఏర్పాటు చేస్తామని ఆమె పేర్కొ న్నారు. సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం ఆకర్షణీ యమైన బాణాసంచా ప్రదర్శనతోపాటు లేజర్ షో కూడా ఉంటుందని వెల్లడించారు. వీటిని తిలకించేందుకు విచ్చేసే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలంటూ సీఎస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. రాష్ట్రావతరణ ఉత్సవాల సందర్భంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని సూచించారు. సమీక్షా సమావేశంలో డీజీపీ రవిగుప్తా, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు దాన కిశోర్, శైలజా రామయ్యర్, శ్రీనివాసరాజు, సాధారణ పరిపాలనశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ట్యాపింగ్‌లో సంచలనాలు

టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

తెలుగు రాష్ట్రాల్లో పెను సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నా యి. టాస్క్‌ఫోర్స్ మాజీ డిసిపి రా ధాకిషన్‌రావు వాంగ్మూలం లో ఎంఎల్ఎల కొనుగోలు కేసు కు సంబంధించి విస్తుపోయే అంశాలు వెల్లడించినట్టు తెలిసింది. కోమటిరెడ్డి రా జగోపాల్‌రెడ్డి 2022 అక్టోబర్‌లో కాం గ్రెస్‌కు రాజీనామా చేసి బిజెపిలో చేరినపుడు మునుగోడు ఉప ఎన్నికల్లో ఆయనను ఓడించాలని కెసిఆర్ భావించారని, రాధాకిషన్‌రావు తన వాంగ్మూలంలో వెల్లడి చేసినట్లు సమాచారం. దుబ్బాక, హుజురాబాద్ ఉప ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులు గెలిచినందున మునుగోడులో ఎలాగైనా బిజెపిని ఓడించాలనే లక్ష్యంతో కెసిఆర్ ఉన్నట్టు రాధాకిషన్‌రావు తెలిపినట్లు తెలుస్తోంది. ఈ సమయంలో నే పైలెట్ రోహిత్‌రెడ్డి సహా పలువురు ఎంఎల్ఎ లు బిజెపిలో చేరేందుకు ఆ పార్టీ అగ్రనేతలను సంప్రదించిన ట్టు తెలిసింది. ఇది తెలిసి బిజెపికి చెక్ పెట్టేందుకు వారిపై సర్వేలైన్స్ పెట్టాలని కెసిఆర్ ఎస్ఐబికి చె ప్పినట్టు రాధాకిషన్‌రావు తన వాం గ్మూలంలో పేర్కొన్నట్లు సమాచారం. అప్పటి ఎస్ఐబి చీఫ్ ప్రభాకర్ రావు ఎంఎల్ఎల కొనుగో లు అంశం పై తనతో చర్చించారని, బిజెపి అ గ్రనేతల ఫోన్‌లను ప్రణీత్‌రా వు బృందం ట్యాప్ చేసిన ట్టు రాధాకిషన్‌రావు చెప్పారని, అలా ట్యాప్ చేసిన ఒక ఆడియో కెసిఆర్ కు పంపినట్టు వెల్లడించారని తెలిసింది. ఆ తర్వాతే కెసిఆర్ అందరినీ ట్రాప్ చేయాలని ఆదేశించినట్టు పేర్కొన్నట్లు సమాచా రం. ఈ క్రమంలో స్పై కెమెరాల కోసం టాస్క్‌ఫో ర్స్ టీంను ఢిల్లీ పంపామని, ట్రాప్ చేయడానికి ఒకరోజు ముందే కెమెరాలను ఫామ్‌హౌస్‌లో అ మర్చామని వెల్లడించినట్లు సమాచారం. ఆపరేష న్ మొత్తం బాధ్యతను సైబరాబాద్ ఎస్‌వోటీ పోలీసులకు అప్పగించామని రాధాకిషన్ రావు తెలిపిన ట్లు తెలుస్తోంది. ఎంఎల్ఎల కొనుగోలు కేసు కో సం ప్రత్యేక దర్యాప్తు వేసి బిజెపి అ గ్రనేత బిఎల్ సంతోష్‌ను అరెస్టు చేయాలని కెసిఆర్ ఆదేశించినట్టు చెప్పారని తెలిసింది. బీఎల్ సంతోష్‌ను అరెస్టు చేస్తే ఢిల్లీ మద్యం కేసులో బిఆర్ఎస్ ఎంఎల్‌సి కవిత అరెస్ట్ కాకుండా బిజెపి అగ్రనేతలతో చర్చలు జరుపుదామని

మిగతా 6లో..

జనరల్ న్యూస్
GENERAL NEWS
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దినపత్రిక
మంగళవారం, 28-05-2023

రూ.250 కోట్ల స్కాంలో రైస్ మిల్లు ఓనర్ ఇమ్మడి సోమ నరసయ్య

అరెస్ట్ అయినట్లు సూర్యాపేట డిఎస్పి వెల్లడి

టైమ్స్ ఆఫ్ వార్త - సూర్యాపేట జిల్లా ప్రతినిధి

సూర్యాపేట జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఇమ్మడి సోమనర్సయ్య ను అరెస్ట్ చేసినట్లు సూర్యాపేట డిఎస్పీ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సి.ఎం.ఆర్ బియ్యం ను ప్రభుత్వానికి అప్పగించకుండా కోట్లు విలువైన ధాన్యాన్ని పక్కదారి పట్టించారని తిరుమలగిరి పోలీసుస్టేషన్‌లో పౌర సరఫరా శాఖ అధికారులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.ఈ ఫిర్యాదు మేరకు ఇమ్మడి సోమనర్సయ్య కు చెందిన మూడు మిల్లులలో అధికారులు తనిఖీలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ తనిఖీల్లో సుమారు రూ.250 కోట్ల విలువైన ధాన్యం మాయమైనట్టు నెల క్రితం అధికారులు గుర్తించారు. ఇందులో భాగంగానే ఆదివారం రాత్రి ఇమ్మడి సోమయ్యను అరెస్ట్ చేసి జుడీషియల్ రిమాండ్ కు తరలించినట్టు సూర్యాపేట డిఎస్పీ తెలియజేశారు.

క్యారం ఫెడరేషన్‌లో మొదటి సభ్యత్వం ఎల్ఐసి దే

క్యారంతో ఎన్నో ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాలు

52 ఏళ్ల క్యారం క్రీడారంగంలో ఎన్నో ఘనతలు సాధించాం

భావితరాలకు ఛాంపియన్లను అందిస్తాం అని చెప్పగలిగే సత్తా ఉండాలి

క్యాట్ వ్యవస్థాపకుడు, మాజీ అధ్యక్షుడు, క్యారం భీష్మ పితామహుడు బీ. కే. హరనాథ్

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ స్పోర్ట్స్

ఐదు దశాబ్దాల క్రితం ఆవిర్భవించిన క్యారం అసోసియేషన్ లో ఎల్ఐసి సంస్థ క్యారం ఫెడరేషన్ లో మొదటి సభ్యత్వాన్ని పొందిందని క్యారం అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు, క్యారం భీష్మ పితామహుడు, క్యారం అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ మాజీ అధ్యక్షుడు బి. కే. హరనాథ్ అన్నారు. క్యారం అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ, నిజామాబాద్ జిల్లా క్యారం అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు క్యాతం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో దాస్ నగర్ లోని నవ్యభారతి గ్లోబల్ స్కూల్లో క్యారం అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆవిర్భవించి 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటుచేసిన స్వర్ణోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ క్యారం క్రీడ ద్వారా ప్రభుత్వ సంస్థలలో ఉద్యోగాలు సాధించి ఉన్నత స్థాయిలో స్థిరపడ్డ వారు ఎంతోమంది ఉన్నారన్నారు. అయితే అంతటి ఘనత సాధించి ప్రత్యేక గుర్తింపు పొందడం వెనుక క్యారం క్రీడా ప్రత్యేకత ఉందని, అందుకని ప్రతి ఒక్కరు క్యారం క్రీడను గౌరవించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. మనమంతా క్యారం సమాజ సభ్యులమని గుర్తు చేశారు. అయితే గతంలో క్యారం క్రీడను మరింత ప్రాచుర్యం చేసే దిశగా క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు మొట్టమొదటిసారిగా హైదరాబాద్ లోని లాల్ బహదూర్ స్టేడియంలో కోచింగ్ సెంటర్ ను ప్రారంభించారని తెలిపారు. ఈ క్రీడను నిర్వహించేందుకు ఆర్థిక వనరులతో పాటు సరైన వేదిక, క్రీడా సామాగ్రి, నిధులు చాలా అవసరమని తెలిపారు. ఎంతో వ్యయప్రయాసాలతో క్యారం క్రీడకు ప్రాణం పోస్తూ దానిని కాపాడుకుంటూ ఈ క్రీడను నమ్ముకున్న క్రీడాకారులను ప్రయోజకులుగా చేయడంతో పాటు వారి ఉజ్వల భవిష్యత్తు దిశగా ఎంతో కృషి జరిగిందన్నారు. అయితే ఇప్పుడు ఈ ఐదు దశాబ్దాల అభివృద్ధిని వెనుకకు తిరిగి చూస్తే మనకు క్యారం క్రీడా ఏం చేసిందో భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. అంతేకాకుండా మనం క్యారం క్రీడా కోసం ఏం చేయాలో ఇదే వేదికగా ఆలోచించాలన్నారు. క్యారం క్రీడ ద్వారా ప్రయోజకులుగా ఎదిగిన వారు ఎంతో మంది ఉండటం గర్వించదగ్గ విషయమేనని తెలుపుతూ రాబోవు తరాల కోసం ఛాంపియన్లను అందిస్తాం అని చెప్పగలిగే సత్తా మనలో ఉండాలన్నారు. ఇంతటితో సరి పెట్టుకోకుండా అలాంటి ఆలోచనతో పాటు ఛాంపియన్లను అందించేవారుగా క్యారం క్రీడను కాపాడుకోవాలని సూచించారు. నవ్యభారతి గ్లోబల్ స్కూల్ వేదికగా జరుపుకుంటున్న గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్లో ప్రస్తుతం చాంపియన్లు తమలాంటి ఛాంపియన్ గా తయారు చేసేందుకు అసోసియేషన్ కు సహకరించాలని ఆయన కోరారు. ఇకపోతే క్యారం కోసం అహర్నిశలు పరితపిస్తూ ఇంత గొప్ప అవకాశాన్ని కల్పించి జాతీయస్థాయి టోర్నమెంట్ నిర్వహించడంతోపాటు స్వర్ణోత్సవాల వేడుకలకు ముందుకు వచ్చిన క్యారం అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షుడు క్యాతం సంతోష్ కుమార్ కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి అవకాశాలను ఈ తరం క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయిలో రాణించేందుకు అంకితభావంతో కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం క్యారం అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ క్యారం ఫెడరేషన్ సెక్రటరీ జనరల్ వీ. డి. నారాయణ్, ఆల్ ఇండియా క్యారం ఫెడరేషన్ జనరల్ సెక్రెటరీ భారతి నారాయణ్, క్యారం అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ప్రెసిడెంట్ కే. సంతోష్ కుమార్, ఆంధ్రప్రదేశ్ క్యారం అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ నీరజ్ సంపతి, క్యారం అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆర్గనైజింగ్ సెక్రటరీ శోభన్ రాజ్, వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ్ కుమార్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం రాంప్రసాద్, నవ్య భారతి గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపల్ కే. శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఓటు వేసేందుకు బారులు తీరిన పట్టభద్రులు

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఓటింగ్

టైమ్స్ ఆఫ్ వార్త - చండ్రుగొండ

ఖమ్మం వరంగల్ నల్గొండ పట్టభద్రుల ఎన్నికలు చండ్రుగొండ మండలంలో ప్రశాంతంగా ముగిశాయి.సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రంలో ఎన్నికలు శాంతియుత వాతావరణంలో ముగిశాయి. పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉదయం 8 గంటలకే పోలింగ్ కేంద్రాల వద్దకు భారీగా చేరుకొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండల వ్యాప్తంగా 789 మంది ఓటర్లు ఉండగా 554 మంది తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.ఇందులో పురుషులు 379 మంది,మహిళలు 175 మంది,ఓట్లు వేశారు.పోలింగ్ కేంద్రం వద్దనే తహశీల్దార్ బి సంధ్యారాణి,ఎంపీడీవో బి అశోక్,డిప్యూటీ తహశీల్దార్ ఎల్ ప్రసన్న, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలింగ్ సరళిని పరిశీలించారు.అలాగే మండల వైద్యాధికారిని డాక్టర్ కనకం తనూజా పోలింగ్ కేంద్రం వద్ద ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి.ఓటర్లకు మందులను, ఓఆర్ఎస్ ప్యాకెట్లు,అందుబాటులో ఉంచారు.అలాగే పోలింగ్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు వారు 144 సెక్షన్ విధించారు. పోలింగ్ కేంద్రానికి రెండు వందల మీటర్ల వరకు నలుగురు కంటే ఎక్కువ ఉండకుండా బందోబస్తు నిర్వహించారు.పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో పోలింగ్ సిబ్బందితో పాటు అధికారులు,పట్టభద్రులకు,వివిధ రాజకీయ పార్టీలకు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

తీన్మార్ మల్లన్న గెలుపు ఖాయం

అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ

టైమ్స్ ఆఫ్ వార్త - చండ్రుగొండ

కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ గెలుపు నల్లేరు మీద నడికేసని అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ అన్నారు. సోమవారం చండ్రుగొండ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఖమ్మం వరంగల్ నల్గొండ పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియను మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత తెలంగాణ ప్రభుత్వం అవలంబించిన ప్రజా వ్యతిరేక విధానాలను తీన్మార్ మల్లన్న ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తూ ప్రజల పక్షాన పోరాడారని. నేడు పట్టబద్ధుల సమస్యలు కూడా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తారనే నమ్మకంతో పట్టభద్రులందరూ తీన్మార్ మల్లన్నను ఆశీర్వదించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు దారం గోవిందరెడ్డి, మండల నాయకులు మాలోత్ బోజ్యా నాయక్, కేశబోయిన నరసింహారావు, అంతటి రామకృష్ణ, బానోత్ రాముడు, బొర్రా సురేష్, అన్వర్, ఫజల్ బక్షి, ఎస్డి సైదా, ఇమ్రాన్, వసీం, సిహెచ్ రాములు, బుంగ శీను, కడియాల పుల్లయ్య, మాజీ సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణి, బి కృష్ణవేణి, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ దంపతులు

టైమ్స్ ఆఫ్ వార్త - సూర్యాపేట జిల్లా ప్రతినిధి

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం నల్లగొండ - ఖమ్మం - వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ లో భాగంగా తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు శ్రీ డా.గాదరి కిశోర్ కుమార్ గారు వారి సతీమణి శ్రీమతి గాదరి కమల గారితో కలిసి తిరుమలగిరి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 449వ బూత్ లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ట్రైనీ ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్

టైమ్స్ ఆఫ్ వార్త - చండ్రుగొండ

ఖమ్మం వరంగల్ నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సరళిని సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ట్రైనీ ఐపీఎస్ అధికారి విక్రాంత్ కుమార్ సింగ్ పరిశీలించారు.పోలింగ్ కేంద్రంలో జరుగుతున్న ఓటింగ్ సరళిని స్వయంగా పరిశీలించారు.పోలింగ్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు పకడ్బందీగా నిర్వహించాలని పోలీస్ సిబ్బందికి సూచించారు.పట్టభద్రులందరూ తమ ఓటు హక్కుని నిర్భయంగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్ స్పెక్టర్ మాచినేని రవి,హెడ్ కానిస్టేబుల్ రవి, కానిస్టేబుల్స్ అశోక్,శివ,రామ్ లాల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణులపై పిడుగు పాటు..

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:

పిడుగుపాటు ఘటనలు గ్రామీణులకు ప్రాణాంతకంగా మారాయి.వారసత్వ ప్రదేశాలు, పురావస్తు కట్టడాలు, వన్యప్రాణులకూ తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. సమర్థ కార్యాచరణను అనుసరించడం ద్వారా ఆ నష్టతీవ్రతను తగ్గించవచ్చు.ఇందుకోసం ప్రభుత్వ యంత్రాంగంతోపాటు ప్రజలూ కలిసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉంది.పిడుగుపాటు ఘటనల ద్వారా గత రెండు దశాబ్దాల్లో దాదాపుగా 52 వేలకుపైగా మరణాలు సంభవించినట్లు అంచనా.భారత్‌లో 2022లో పిడుగుల వల్ల 2,887 మంది మృత్యువాత పడ్డారని జాతీయ నేర గణాంకాల సంస్థ నివేదించింది.అత్యధికంగా మధ్యప్రదేశ్, బిహార్, ఒడిశా, ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రాల్లో మరణాలు నమోదయ్యాయి.దేశంలో మధ్యప్రదేశ్‌లో ఎక్కువ పిడుగుల ఘటనలు నమోదవుతున్నాయి. , పిడుగుపాటు ఘటనలతో ఆకస్మిక మరణాలుసంభవించడంతోపాటు,తీవ్ర గాయాలతో ఆసుపత్రుల పాలవుతున్నవారూ గణనీయంగా ఉంటున్నారు.పదుల సంఖ్యలో మూగజీవాలు కూడా పిడుగు పాటుకు గురై ప్రాణాలు కోల్పోతున్నాయి.అడవుల నరికివేత, పెరుగుతున్న ప్రపంచీకరణతో వెలువడే వాయు కాలుష్యంతో భూమి, సముద్ర ఉపరితలాలు వేడెక్కడం వల్ల పిడుగుపాటు ఘటనలు పెరుగుతున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.దేశంలో పిడుగుపాటు ఘటనలు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో సంభవిస్తున్నాయి.సరైన అవగాహన లేకపోవడంతో ఉరుములు, మెరుపులు సంభవించే సమయాల్లో రైతులు వ్యవసాయ పనులు చేస్తుండటం, చెట్ల కింద నిలబడటం వంటి కారణాలతో గ్రామీణ ప్రాంతాల్లోనే అత్యధిక మరణాలు సంభవిస్తున్నాయి. మృతుల్లో 77శాతందాకా వ్యవసాయదారులే ఉంటున్నారు.పిడుగుపాటుకు గురైన వారిలో చాలామంది కాలిన గాయాలు,గుండె,చెవుల సంబంధిత వ్యాధులతో బాధపడుతూ జీవనోపాధి కోల్పోయి, ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారు.దేశంలో పిడుగులపై అధ్యయనం చేసే సంస్థ నివేదిక ప్రకారం ఒడిశా, మధ్యప్రదేశ్, పశ్చిమ్ బెంగాల్, ఝారండ్ రాష్ట్రాల్లో పిడుగుపాటు కారణంగా సంభవించే మరణాల్లో 60-70శాతం గిరిజనులవేనని తేలింది.పిడుగుపాటు ఘటనలతో అధిక మరణాలు సంభవించినా దేశవ్యాప్తంగా వాటి సమాచారం, జీవనోపాధి, ఆస్తినష్టం పూర్తిస్థాయిలో నమోదు కావడం లేదు.ఫలితంగా, కేంద్ర ప్రభుత్వం వీటిని ప్రకృతి విపత్తుగా గుర్తించడం లేదు.అందుకని ఇలాంటి ఘటనలతో సంభవించే ప్రాణ, ఆస్తి నష్టాలను పకడ్బందీగా నమోదు చేసేలా జాగ్రత్తలు తీసుకోవాలి.ఇందుకోసం నిర్దిష్టమైన వ్యవస్థ, ఏర్పాట్లు ఉండటం మేలుచేస్తుంది.కేంద్ర ప్రభుత్వం పిడుగుపాటు ఘటనలను ప్రకృతి విపత్తుగా గుర్తిస్తే బాధితులు రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి కింద పరిహారం పొందేందుకూ అవకాశం ఉంటుంది.దేశంలో వాయు కాలుష్యాన్ని తగ్గించకపోతే పిడుగుపాటు ఘటనలు మరింతగా సంభవించే అవకాశాలు ఉన్నట్లు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మీటియోరాలజీ శాస్త్రవేత్తలు స్పష్టంచేశారు. ఈ మేరకు వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రజలు,ప్రభుత్వాలు కలిసి సాగాలి.ఒడిశాలో పిడుగుపాటు మరణాలను తగ్గించేందుకు ముందస్తు హెచ్చరిక వ్యవస్థల ఏర్పాటు,కమ్యూనిటీ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఫలితంగా 2017లో 446 మంది పిడుగుపాటు ఘటనలతో మరణించగా, ఆ సంఖ్య 2021 నాటికి 287కి తగ్గింది.పిడుగుల ముప్పును ముందుగానే హెచ్చరించే సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో రాష్ట్రాలు తమ పరిధిలో ముప్పు అధికంగా ఉండే ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలి.ఇందుకు జిల్లా స్థాయిలో ప్రణాళికలు రూపొందించాలి.గ్రామీణ ప్రాంతాల్లో పిడుగులు పడే సమయాల్లో ప్రాణాలు రక్షించుకొనే విధానం, ప్రథమ చికిత్సలు వంటి అంశాలపై అన్ని గ్రామాల్లో గోడపత్రుల ద్వారా అవగాహన పెంపొందించాలి.అదేవిధంగా మరణాలు సంభవించకుండా, ఆస్తినష్టం వాటిల్లకుండా అడ్డుకట్ట వేయడానికి రక్షణ పరికరాలు గ్రామీణ ప్రజలకు రాయితీతో కూడిన ఉపకరణాలను ప్రభుత్వాలు అందించాలి.పిడుగుపాటు విపత్తును విద్యార్థులకు పాఠ్యాంశంగా చేర్చేలా రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.పిడుగులను ముందుగానే గుర్తించి, అప్రమత్తంచేసే సాంకేతికతపై అగ్నిమాపక శాఖ అందరికీ అవగాహన కల్పించాలి.2021లో జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ దేశంలో ఉరుములు, మెరుపుల ద్వారా జరిగే ప్రాణనష్టాన్ని తగ్గించడానికి కార్యాచరణను రూపొందించింది.రాష్ట్ర ప్రభుత్వాలు సైతం ఇలాంటి కార్యాచరణ ప్రణాళికలను చేపట్టడం ద్వారా పిడుగుపాటు ఘటనలతో సంభవించే ఆస్తి, ప్రాణ నష్టాలను నివారించవచ్చు.

పోలింగ్ సరళిని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే తాటి

టైమ్స్ ఆఫ్ వార్త - చండ్రుగొండ

ఖమ్మం వరంగల్ నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సరళిని అశ్వారావుపేట మాజీ శాసనసభ్యులు తాటి వెంకటేశ్వర్లు పరిశీలించారు. సోమవారం చండ్రుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రంలోని ఎన్నికల సరళిని మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన ఎన్నికల శిబిరంలో కూర్చొని పట్టభద్రులకు పలు సూచనలు చేస్తూ ప్రశ్నించే గొంతుకకు తమ ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అక్కడే ఉన్న కార్యకర్తలతో కలిసి ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యావంతుడు, విద్యావేత్త, అయిన ఏనుగుల రాకేష్ రెడ్డి విజయం తథ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ధారా వెంకటేశ్వరరావు (బాబు), జడ్పిటిసి కొనగండ్ల వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ నరుకుల్ల సత్యనారాయణ, గుంపెన సొసైటీ వైస్ చైర్మన్ నల్లమోతు వెంకటనారాయణ, జిల్లా నాయకులు మేడ మోహన్ రావు, మండల నాయకులు సత్తి నాగేశ్వరరావు, సూర వెంకటేశ్వర్లు, నరుకుల్ల వాసు, భూపతి రమేష్, గాదె లింగయ్య, గుగులోత్ రమేష్, భూపతి శ్రీనివాసరావు, చాపలమడుగు రామరాజు, నరుకుల్ల అప్పాజీ, కేలోత్ శ్రీనివాస్ నాయక్, గుగులోతు శివ, మల్లెం వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ పూసం వెంకటేశ్వర్లు, కొండ, కన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

జనరల్ న్యూస్
GENERAL NEWS
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దినపత్రిక
మంగళవారం, 28-05-2023

పిఎఫ్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

బిఎల్ టియు రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ డిమాండ్

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లాలోని మున్సిపల్, బీడీ, ఇతర పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు రిటైర్మెంట్ అయినవారికి,మృతి చెందిన వారికి రావాల్సిన పిఎఫ్, ఇన్సూరెన్స్ డబ్బులు కోట్లాది రూపాయలు కార్మికుల బ్యాంక్ ఖాతాలకు జమచేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్న నిజామాబాద్ పీఎఫ్ కార్యాలయం అధికారుల పై చర్యలు తీసుకోవాలని బి ఎల్ టి యు రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ డిమాండ్ చేశారు.సంవత్సరాల తరబడి కార్మికులను తమ చుట్టూ తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా న్యాల్కల్ రోడ్డులో గల పిఎఫ్ కార్యాలయం ముందు కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు.అనంతరం దండి వెంకట్ మాట్లాడుతూ ఈ వేదింపులు తట్టుకోలేని కార్మికులు పిఎఫ్ కార్యాలయం కొంత మంది సిబ్బందితో 20,30 శాతం పర్సంటేజ్ ఇస్తే పనులు చేయిస్తున్నారని దండి వెంకట్ ఆరోపించారు.వారంరోజుల్లో పిఎఫ్,ఇన్సూరెన్స్ డబ్బులు కార్మికుల ఖాతాల్లో జమ చేయని పక్షంలో పిఎఫ్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు.ఎల్లారెడ్డి,ఆర్మూర్ మున్సిపల్ కార్మికులకు గత రెండు సంవత్సరాలుగా పిఎఫ్,ఇన్సూరెన్స్ డబ్బులు కార్మికుల ఖాతాల్లో జమ చేయడం లేదని వెంటనే జమచేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్య క్రమంలో బహుజన లెఫ్ట్ మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత,బిఎల్ టియు జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్,మున్సిపల్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు నవీన్, ఎం.ఎల్లయ్య, నగర నాయకులు కె.సహదేవ్,ఎల్లారెడ్డి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి మల్లేష్, ఆర్మూర్ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రాజేశ్వర్ లతోపాటు నిజామాబాద్,ఆర్మూర్,ఎల్లారెడ్డి మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు పెరిగిన వేతనం అమలు చేయాలి

బీడీ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు వై. ఓమయ్య

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

బీడీ కార్మికులకు పెరిగిన వేతనం అమలు చేయాలని బీడీ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు వై. ఓమయ్య డిమాండ్ చేశారు. జిల్లా ఏఐటీయూసీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర బీడీస వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీడీ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు వై. ఓమయ్య ప్రధాన కార్యదర్శి సజ్జన భాను చందర్, నాయకులు మారంపల్లి మల్లు బాయ్, రవీందర్, సాయికిరణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వై. ఓమయ్య మాట్లాడుతూ బీడీ కార్మికుల ప్యాకర్ల నెలసరి ఉద్యోగుల గత వేతన ఒప్పందం 30 ఏప్రిల్ 2024తో ముగిసిందని, నూతన వేతనాలు మే ఒకటవ తేదీ నుంచి అమల్లోకి రావలసిన అవసరం ఉన్నా యాజమాన్యం పెంచకపోవడంతో మూడు నెలలుగా బీడీ కార్మిక సంఘాలు ఫెడరేషన్ల ఆధ్వర్యంలో పోరాటం చేసిన ఫలితంగా మే 25న హైదరాబాదులో బీడీ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ బీడీ కార్మిక సంఘాలు ఫెడరేషన్లతో సానుకూల వాతావరణంలో చర్చలు జరిగి బీడీ కార్మికులకు వెయ్యి బీడీలకు 4 రూపాయల 25 పైసలు

పాకర్లకు 3650/-,నెలసరి ఉద్యోగులకు(బట్టి వాల)1700/-ప్రస్తుత ఇస్తున్న వేతనంపై పెంచుకోవడం జరిగిందని అన్నారు. పోరాడి వేతనాలు పెంచుకున్న కార్మికులకు ఏఐటియుసి తరఫున శుభాకాంక్షలు,ఉద్యమాభివందనాలు తెలియజేశారు.పెంచిన వేతనం మే ఒకటవ తేదీ నుంచి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ లేని పక్షంలో ఆందోళన చేస్తామని తెలియజేశారు.

భారత ప్రధానిగా నెహ్రూ ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలతో అభివృద్ధి వైపు నడిపించారు

తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందన్

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

భారత ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన జవహర్లాల్ నెహ్రూ ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకొని భారతదేశన్ని అభివృద్ధి వైపు నడిపించారని తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహర్ బిన్ హాందాన్ అన్నారు.భారతదేశ మొదటి ప్రధాని స్వర్గీయ జవహర్లాల్ నెహ్రూ వర్ధంతిని నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ భవన్ లో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహేర్ బిన్ హందాన్, కాంగ్రెస్ నాయకులు కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తాహేర్ బిన్ హాందాన్ మాట్లాడుతూ జవహర్ లాల్ నెహ్రూ దేశాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్లిన నాయకుడని, బ్రిటిష్ వారు దేశాన్ని పూర్తిగా దోచుకున్న తర్వాత భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత మొదటిసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నెహ్రూ భారత దేశంలో ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకొని దేశాన్ని అభివృద్ధి వైపు నడిపించారాని, పంచవర్ష ప్రణాళిక ద్వారా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశారని ఆయన అన్నారు. జవహర్లాల్ నెహ్రూకు నిజామాబాద్ జిల్లాలతో ఎంతో అవినాభావ సంబంధం ఉందని, శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో నెహ్రూ నిజామాబాద్ జిల్లాకు వచ్చారని, నిజామాబాద్ జిల్లాలో రైతులకు లక్షల ఎకరాలకు నీరు రాడానికి శ్రీరామ్ నగర్ సాగర్ కారణమని ఆయన అన్నారు. నెహ్రూ ఆలోచన విధానాలను ఆశయాలను కాంగ్రెస్ నాయకులు అందిపుచ్చుకొని ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అంతిరెడ్డి రాజారెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు సంతోష్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు రాజ నరేందర్ గౌడ్, కైసర్, స్వామి గౌడ్, ప్రమోద్, ముష్య పటేల్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాకేష్ రెడ్డి విజయం ఖాయం!

డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్

టైమ్స్ ఆఫ్ వార్త - మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి

ఉమ్మడి వరంగల్ - ఖమ్మం - నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి గెలుపు ఖాయమని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యా నాయక్ అన్నారు.సోమవారం చిన్న గూడూరు మండల కేంద్రంలోని జడ్పీఎస్ ఎస్ పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే డి ఎస్ రెడ్యా నాయక్, వారి తనయుడు యువనేత డిఎస్ రవిచంద్ర ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం కార్యకర్తలతో కలిసి రెడ్యా నాయక్ మాట్లాడారు. ఉమ్మడి వరంగల్ - ఖమ్మం -నల్గొండ జిల్లాల వ్యాప్తంగా పట్టభద్రులు,నిరుద్యోగులు, మేధావులు రాకేష్ రెడ్డి వైపే మొగ్గు చూపారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న నిజ స్వరూపాన్ని అర్థం చేసుకున్న మేధావులు ఉన్నత విద్యావంతుడైన రాకేష్ రెడ్డికి ఓటేసారని తెలిపారు. మొదటి ప్రాధాన్యత ఓట్ల తోనే అధిక మెజారిటీ తో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో అభివృద్ధి కేసిఆర్ నాయకత్వంలోనే జరిగిందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు వల్లూరు వెంకటరెడ్డి, మంగపతి రావు, మండల పార్టీ అధ్యక్షులు డిఎస్ రామ్ సింగ్, ప్రధాన కార్యదర్శి కర్రే దారాసింగ్, వల్లూరి చెన్నారెడ్డి,బాదావత్ సురేష్, శ్రీను, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం సేవలో జిల్లా జడ్జి సునీత కుంచాల

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగరం లోని జిల్లా కోర్టుకు ఈ వేసవికాలం దృశ్య వివిధ పనుల కోసం అత్యవసరంగా వచ్చే నిరుపేద ప్రజలకు ఆకలి తీర్చేందుకు జిల్లా కోర్టు వద్ద జిల్లా జడ్జి సునీత కుంచాల కక్షిదారులకు భోజనం అందజేసే అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువ ఉన్న దృశ్య ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసరం అయితే తప్ప ఎండలో బయట తిరగద్దని ఆమె ప్రజలకు సూచించారు. జిల్లా కోర్టు లైసన్ ఆఫీసర్ ఎస్సై శ్యాం కుమార్ సౌజన్యంతో ఈ అన్నదాన సేవా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్, జిల్లా న్యాయ సేవా సంస్థ పర్యవేక్షకులు పురుషోత్తం గౌడ్, న్యాయవాదులు, సిబ్బంది, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటిన క్యూరియస్ తైక్వాండో అకాడెమీ క్రీడాకారులు

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ స్పోర్ట్స్

ఇటీవల హైరాబాద్ లోని ఎల్ బి నగర్ లో నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో క్యూరియస్ అకాడమీ క్రీడాకారులు సత్తా చాటారు. ఇందులో భాగంగా జిల్లాకు చెందిన 56 మంది క్రీడాకారులు క్యురోగి, పూంసే బాలబాలికల కేటగిరీ పివీ, సబ్ జూనియర్, కెడెట్, జూనియర్, సీనియర్ విభాగాలలో పోటీపడి 18 స్వర్ణ, 12 రజత, 20 కాంస్య పతకాలు సాధించారు. మొత్తం 56 మంది పాల్గొని 50 పతకాలు సాధించడం జరిగిందని జిల్లా తైక్వాండో అసోసియేషన్ జెనరల్ సెక్రటరీ, ట్రెజరర్ వినోద్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలో అత్యధిక పథకాలు సాధించి, నిజామాబాద్ జిల్లాను ఓవరాల్ ఛాంపియన్ గా నిలిపి సత్తా చాటడంతో తైక్వాండో క్రీడాకారుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తంచేశారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం ప్రిన్సిపల్ నీలిమాదేవి..

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:

బాన్సువాడ మండలం, కోనాపూర్ హనుమాజిపేట్ గ్రామాల మధ్య మంజూరైన గిరిజన బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ నీలిమాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు . ఎంపీసీ, బైపీసీ, గ్రూపులో ఖాళీగా ఉన్న సీట్లకు మే 29 లకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. ఈ సదా అవకాశాన్ని ఆసక్తి అర్హత కలిగిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

మిర్జాపూర్ విండో చైర్మన్‌గా రాంబాబు ఎంపిక

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:

బాన్సువాడ నియోజకవర్గం నసురుల్లాబాద్ మండలం మిర్జాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ గా రాంబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సొసైటీ కి చెందిన 12 మంది డైరెక్టర్లు గతంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా... అప్పటి చైర్మన్ మారతి పటేల్ అవిశ్వాసానికి ముందే రాజీనామా చేశారు. కాగా.. సోమవారం ఒకే నామినేషన్ దాఖలు కావడంతో రాంబాబు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సీఈఓ జాకీర్ తెలిపారు. ఆయన ఎన్నిక పట్ల పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బాన్సువాడ మున్సిపల్ కమిషనర్‌గా శ్రీహరి రాజు

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:

బాన్సువాడ పట్టణ మున్సిపల్ కమిషనర్ గా శ్రీహరి రాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు .ఇదివరకు ఇక్కడ పనిచేసిన మున్సిపల్ కమిషనర్ అలింపై అవినీతి ఆరోపణలు రావడంతో తాజాగా సస్పెన్షన్ వేటు వేశారు. కాగా ఆయన స్థానంలో ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

ట్రాన్స్‌కో నిర్లక్ష్యం.. నిండు ప్రాణం బలి

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:

ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యానికి సోమవారం ఒక నిండు ప్రాణం బలైంది బాన్సువాడ నియోజకవర్గం రుద్రూర్ మండలంలోని రాయకూరు క్యాంప్లో కరెంట్ షాక్ తో అదే గ్రామానికి చెందిన లతీఫ్ (28) అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం రాత్రి ఇచ్చిన ఈదురు గాలులకు కరెంట్ స్తంభాలు, వైర్లు నేల కొరిగాయి. ఇదిలా ఉండగా వాటిని ఉదయం వరకు కూడా ట్రాన్స్‌కో అధికారులు సరి చేయడం కాదు కదా కనీసం పట్టించుకోకపోవడంతో ఈ ఘాతకం జరిగిందని స్థానికులు తెలిపారు .గ్రామ శివారులో ఉపాధి హామీ పనులకు వెళ్లిన లతీఫ్ ఇంటికి వస్తుండగా దారికి అడ్డంగా ఉన్న వైరును పైకెత్తి వచ్చే ప్రయత్నంలో కరెంటు వైర్ అతుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందాడని దీనికి కారకులైన ట్రాన్స్కో అధికారులపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

తెగిపడ్డ విద్యుత్ తీగలను పునరుద్ధరించిన సిబ్బంది

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ

బాన్సువాడ నియోజకవర్గం నసురుల్లాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో ఈదురు గాలులు ఆదివారం సాయంత్రం బీభత్సం సృష్టించాయి. పలుచోట్ల భారీ వృక్షాలు నేలకు ఒరిగాయి. ఇళ్లపై కప్పులు, రేకుల షెడ్లు లేచిపోయాయి, విద్యుత్ స్తంభాలు విరిగిపోయి, విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. మైలారం గ్రామంలో తెగిపోయిన విద్యుత్ తీగలను సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సిబ్బంది శ్రమించి పునరుద్ధరించారు. విద్యుత్ అధికారుల పనితీరు పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

గొర్లకు చిటుకు రోగ నివారణ టీకాలు

టైమ్స్ ఆఫ్ వార్త - మాక్లూర్.

మాక్లూర్ కేంద్రములో గొర్ల కాపరుల వద్దకు వెళ్లి,గొర్లకు చిటుకు రోగ నివారణ టీకాలు, పశు వర్ధక శాఖ, పశువైద్య శాఖ అధ్యర్యములో, మాక్లూర్ మండల పశువైద్య డాక్టర్ ఉమామ సహెర్ వాస్ వేశారు. ఈ సందర్భముగా మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగ అందిస్తున్న చిటుకు రోగ నివారణ టీకాలు, గొర్ల కాపారులు వినియోగించుకోవాలని అన్నారు. చిటుకు రోగ నివారణ టీకాల మందు, పశువులకు సీజనల్ వ్యాధులు జబ్బవాపు,గొంతు వాపులకు సంబంధించిన మందులు అందుబాటులో యున్నాయని తెలియజేశారు. వీటిని గొర్లు, పశువులు,కలిగిన రైతులు వినియోగించుకోవాలన్నారు.ఈ కార్యక్రమములో పశు వైద్య డాక్టర్ ఉమామ సుమెర్ తో పాటు వివిఎల్ ఓ వినిత,వివి హమ్మద్ పాషా,జైల్ సింగ్, శ్రీనివాస్, గంగాధర్ పుష్ప,లక్మి, గొర్ల యజ మానులు సురేష్ యాదవ్, గంగాధర్ యాదవ్ పాల్గొన్నారు.

జనరల్ న్యూస్
GENERAL NEWS
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దినపత్రిక
మంగళవారం, 28-05-2023
4

పార్లమెంట్ ఎన్నికల అంతిమ ఫలితాన్ని ఆకస్మికంగా ప్రకటించవద్దు

చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్

టైమ్స్ ఆఫ్ వార్త మెదక్ జిల్లా ప్రతినిధి

పోలైన ఓట్ల లెక్కింపు అన్ని విధాలుగా సక్రమంగా జరిగిందో లేదో క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే తుది ఫలితాన్ని ప్రకటించాలని ఆయన అన్నారు.సోమవారం ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన ఎన్నికల అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులతో కౌంటింగ్ కసరత్తు కోసం జరుగుతున్న ఏర్పాట్లను సమీక్షించారు. తుది ఫలితం అనంతరం ఫారమ్ నంబర్ 21 సి (గెలుపు సర్టిఫికేట్) జారీ చేయబడుతుంది.రాజీవ్ కుమార్ , జ్ఞానేష్ కుమార్, ఎలక్షన్ కమీషనర్, దేశంలోని స్పెక్ట్రమ్‌లోని అధికారులందరికీ పోలింగ్‌ను విజయవంతంగా నిర్వహించినందుకు ఇప్పటివరకు విజయవంతంగా ఎన్నికల నిర్వహణకు కృషి చేసినందుకు అభినందనలు తెలిపారు.కౌంటింగ్‌లో ప్రతి అంశంలోనూ నిబంధనలను నిశితంగా పాటించాలని, కౌంటింగ్ హాల్‌లలో అన్ని చర్యలలో పారదర్శకంగా ఉండాలని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఆర్ఓలను ఆదేశించారు. కౌంటింగ్ ప్రక్రియ సమయంలో ఏర్పడే ఏవైనా సమస్యలను నిర్వహించడంలో తీవ్ర జాగ్రత్త వహించాలన్నారు.కౌంటింగ్ కోసం తగినంత సంఖ్యలో కౌంటింగ్ టేబుల్స్ ఏర్పాటు చేయాలని, రౌండ్ల వారీగా ప్రకటనలు చేయాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ హాల్‌లోకి వీడియో కెమెరాలు, సెల్‌ఫోన్లు తీసుకురావడం నిషేధం. కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రత కల్పించాలి. స్ట్రాంగ్‌రూమ్‌ల నుంచి ఈవీఎంఎస్‌ను తీసుకొచ్చే సమయంలో ఏదైనా అలసత్వం ఉంటే ఎలాంటి లొసుగులు లేదా ప్రోటోకాల్ ఉల్లంఘన జరగదని ఆయన చెప్పారు.వి వి ప్యాట్ స్లిప్‌లను జాగ్రత్తగా నిర్వహించాలని మరియు భవిష్యత్తులో ధృవీకరణ/వ్యాజ్యం ఏదైనా ఉంటే వాటిని లెక్కించిన తర్వాత వాటిని నియమించబడిన సీల్డ్ కవర్‌లో ఉంచాలని సీ ఈ సీ అర్ హెు లను కోరింది.హైదరాబాద్ నుంచితెలంగాణ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వికాస్ రాజ్, అడిషనల్ సీఈఓ డీఎస్ లోకేశ్ కుమార్, జాయింట్ సీఈఓ సరఫ్ రాజ్ అహ్మద్, డిప్యూటీ సీఈవోలు అబ్దుల్ హమీద్, బి. హరిసింగ్‌లతో కలిసి సదస్సుకు హాజరయ్యారు.మెదక్ కలెక్టర్ కార్యలయం నుంచి మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం నియమాలను తప్పనిసరిగా పాటించి కౌంటింగ్ నిర్వహిస్తామని, కౌంటింగ్ కు అన్ని ఏర్పాటు చేశామని ,కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ పూర్తి చేశామని , కౌంటింగ్ ను పారదర్శకంగా ,సీసీటీవీ కెమెరాలు,కేంద్ర బలగాలు పహారా ల ముందు కౌంటింగ్ నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమం లో డిఆర్ఓ పద్మశ్రీ ఆర్డీవో రమాదేవి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రమాబాయి అంబేద్కర్‌కు ఘన నివాళులు

టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-

పట్టణంలో ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం రమాబాయి అంబేద్కర్ 88వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పట్టణంలోని బాబా సాహెబ్, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద రమాబాయి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి,ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం సంఘం నాయకులు మాట్లాడుతూ,మాత రమా బాయి అంబేద్కర్ ఎన్నో త్యాగాలు చేశారని, అంబేద్కర్ కి ఎన్ని కష్టాలు ఉన్న, వారి వెనకాల ఉండి, వారి పిల్లలను సైతం దేశం కోసం,ప్రజల కోసం త్యాగం చేసిన గొప్ప మహిళ అని కొని యాడారు.ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మొయ్య రాంబాబు, తుంగపిండి శంకర్,పాత వీరస్వామి నెరవట్ల శ్రీని వాస్, కొండిళ్ళ శ్రీనివాస్,సప్పిడి నరేష్,దాసరి ఎల్లారం, కాసీపేట స్వామి తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల కొనుగోలుపై అవగాహన

విత్తన డీలర్ల షాపుల తనిఖీ

టైమ్స్ ఆఫ్ వార్త - మాక్లూర్

మాక్లూర్ కేంద్రములోగల విత్తన డీలర్ల షాపులను, ప్రాథమిక వ్యసాయసహకార సంఘం , వీరబద్ర, లక్ష్మి నరసింహ గోదాములను మాక్లూర్ మండల వ్యవసాయ అధికారిని పి. పద్మ తనిఖీ చేశారు. చికిలి, కొత్తపల్లి గ్రామాలలో రైతులకు విత్తనకొనుగోలు పై ఎఈఓ రాజహాస పలు సూచనలు చేశారు. గొటుముకుల, బొంకన్ పల్లి గ్రామాలలో ఏఈ ఓ రైతులకు విత్తనాలు కొనుగోలు పై అవగాహన కల్పించారు. విత్తనకొనుగోలు చేసేటప్పుడు సీల్ యున్న బస్థాలను, కొని రసీదు తప్పని సరిగా పొందాలని అన్నారు.విత్తనాలు, విత్తుకున్న తరువాత,కాలి సంచులు, రసీదులు పంటచేతి కందేవరకు నిద్రపరుచుకోవాలన్నారు. విత్తనాల డీలార్లు, స్వచ్ఛమైన విత్తనాలు మాత్రమే అమ్మాలని, కాలం చెల్లిన నకిలీ విత్తనాలు అమ్మినచో చట్టరీత్యా చర్యలు తప్పవని అన్నారు.

ఎమ్మెల్సీ ఓటు వేసిన దివ్యాంగురాలు

టైమ్స్ ఆఫ్ వార్త మోతె

కోదాడ మోతె సోమవారం మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఎమ్మెల్సీ ఉప ఎన్నికలలో తన ఓటు హక్కును ట్రై సైకిల్ పై పోలింగ్ కేంద్రం లోకి ఎన్నికల సిబ్బంది తీసుకువెళ్ళి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా వికలాంగులకు నడవలేని పట్ట బద్రులను ఓటు వేసి విధంగా సిబ్బంది సహకారం మండలంలో సుమారు గా1543 ఓటర్లు ఉండగా పురుషులు 1083 స్త్రీలు 460 ఎమ్మెల్సీ ఓట్లు ఉన్నాయని పోలింగ్ ముగిసే సమయానికి 1097 ఓట్లు పోలయి నాయని ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసుల సహకారం తో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా మిగిసినట్లు ఎలక్షన్ సెక్టోరియల్ అధికారి సిహెచ్ కృష్ణ చెప్పారు

విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు వహించాలి

టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-

రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తగిన జాగ్రత్తలు వహించాలని మండల వ్యవసాయ అధికారి రాజేశం సూచించారు. సోమవారం మండలంలోని శంకర్ పల్లి, చిర్రకుంట గ్రామపంచాయతీ పరిధిలోని రైతులకు విత్తనాల కొనుగోలు సమయాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లూజుగా ఉన్న విత్తన సంచులు కొనుగోలు చేయరాదని సూచించారు. అధీకృత లైసెన్స్ కలిగి ఉన్న డీలర్ ల నుండి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. తప్పనిసరిగా విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రసీదు పొంది, ఆ రసీదును, విత్తన సంచులను పంట కోత పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి, శంకర్ పల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి రాజేష్, కారోబార్ హర్ష, రైతులు ఓడ్నాల కొమురయ్య, రాంచందర్, రాజయ్య పాల్గొన్నారు

బోర్లాం గ్రామాన్ని సందర్శించి బాధితులకు భరోసా కల్పించిన అదనపు జిల్లా కలెక్టర్ చంద్రమోహన్

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:

బాన్సువాడ మండలం బోర్లం, బోర్లం క్యాంప్ లో గత రాత్రి గాలివాన బీభత్సానికి గురైన బాధితులను అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ పరమార్శించి భరోసా కల్పించారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశాల మేరకు సోమవారం అదనపు కలెక్టర్ బోర్లం , బోర్లం క్యాంప్ లో దెబ్బతిన్న రేకుల ఇండ్లు, పెంకుటిల్లులు, కల్కి చెరువు ప్రాంతంలో నేలకొరిగిన, ధ్వంసమైన విద్యుత్ స్థంబాలు సందర్శించారు. ఈదురుగాలులకు 60 ఇండ్ల మేర నష్టం వాటిల్లగా, 15 ఇండ్ల పై కప్పు రేకులు లేచిపోయి నిరాశ్రయులై పక్క ఇండ్లలో ఆశ్రయం పొందిన బాధితులను పరమార్శించి ప్రభుత్వానికి నివేదిక అందించి అన్ని విధాలా ఆదుకుంటామని ధైర్యం చెప్పారు. తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్ లు రెండు రోజులలోగా క్షేత్ర స్థాయిలో జరిగిన నష్టాన్ని అంచనా వేసి నివేదిక అందజేయవలసినదిగా ఆదేశించారు. తక్షణ సాయంగా బాధితులకు ఉచితంగా 10 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, మంచినూనె, కారం, చినేతపండు, ఉప్పు వంటివి అందించవలసినదిగా సూచించారు. అనంతరం బాన్సువాడ, పిట్లం, నాసురుల్లాబాద్, బిచ్కుంద మండలాలలోని పలు రైస్ మిల్లులను ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లతో కలిసి అన్ లోడింగ్ పాయింట్ లను ఎక్కువగా పెట్టుకొని త్వరగా ధాన్యం దించుకోవాలని మిల్లర్లకు సూచించారు. ముందుగా బాన్సువాడలో ఉమా మహేశ్వర ఇండస్ట్రీస్, పిట్లం లోని వైష్ణవి ఆగ్రో ఇండస్ట్రీస్, బిలాల్ బిన్నీ రైస్ మిల్, బిచ్కుంద లోని శివ బాలాజీ ఆగ్రో ఇండస్ట్రీస్, నాసురుల్లాబాద్ లోని పారిజాత ఇండస్ట్రీస్, శ్రీ లక్ష్మి శ్రీనివాస ఇండస్ట్రీస్ రైస్ మిల్లులను సందర్శించారు. జిల్లాలో ఇప్పటి వరకు 350 కొనుగోలు కేంద్రాలకు గాను 310 కేంద్రాలలో కొనుగోళ్లు పూర్తిచేశామని, మిగిలిన 40 కేంద్రాలలో ధాన్యం 2,3 రోజులల్లో సేకరించి ప్రక్రియ పూర్తిచేస్తామన్నారు. ఇప్పటి వరకు 52,413 మంది రైతుల నుండి 670 కోట్ల విలువల 3,03,852 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతులకు 603 కోట్లు చెల్లించామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రమేష్ రాథోడ్, తహసీల్దార్ వరప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు,

ఆటో డ్రైవర్ నవీన్‌ను అభినందించిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గునిగంటి కమలాకర్

టైమ్స్ ఆఫ్ వార్త - మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి

చిన్న గూడూరు మండలం పట్టబద్రుల, రవాణా, సౌకర్యార్థం కొరకు మండలంలోని పలు గ్రామాల నుండి పట్టభద్రుల, కొరకు ప్రత్యేక వాహనాన్ని నడుపుతున్న గునిగంటి నవీన్‌ను, డోర్నకల్, నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గునిగంటి కమలాకర్ అభినందించడం జరిగింది. తనవెంట మండల అధ్యక్షులుమారబోయిన వెంకటేశ్వర్లుప్రధానకార్యదర్శి సూదగానినాగేష్, కోఆర్డినేటర్ గాడిపెల్లి జీవన్, చిన్నగూడూర్ గ్రామ పార్టీఅ ధ్యక్షులుబత్తెం రమేష్ హబూబబాద్, జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ చాగంటి సందీప్, చిన్నగూడూరు మండల యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దాసరిరాజుముదిరాజ్, తుమ్మల చెరువు తండా కాంగ్రెస్ సీనియం్ నాయకుడు సేవ్య నాయక్ ఉగ్గంపల్లి ఇందిర కమిటీ అధ్యక్షులు ధరంసోత్,వెంకటియ,గ్రామ,పార్టీ అధ్యక్షులు గండ్లె భద్రయ్య, యూత్ ఉపాధ్యక్షులు జక్కుల, మురళి, తదితరులు,ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించాలి

అమ్మ ఆదర్శ పాఠశాలలో పెండింగ్ పనులను పూర్తిచేయాలి

జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

టైమ్స్ ఆఫ్ వార్త మెదక్ జిల్లా ప్రతినిధి

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు.రామాయంపేట మండలం లోని దామరచేరు గ్రామం లో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతిని ఆరా తీశారు. విద్యార్థులు మంచిగా చదువుకునేందుకు అనువుగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పనకు మరమ్మత్తు పనులు చేపట్టినట్లు తెలిపారు. పాఠశాలలు పునఃప్రారంభం నాటికి ఒక్క పని పెండింగ్ లేకుండా అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడం లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి పాఠశాలల్లో కావలసిన మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని తెలిపారు. పాఠశాలలో విద్యుత్, మంచినీరు, మరుగుదొడ్లు,హ్యాండ్ వాష్ ప్లాట్ ఫామ్ వంటి మౌలిక వసతులుతో పాటు చిన్న, చిన్న మరమ్మత్తు పనులు సైతం పూర్తి చేయాలని అన్నారు. పాఠశాలల్లో మైదానాలను ఉపాధి హామీ పథకం నిధులతో చదును చేపట్టాలని అన్నారు. రానున్న హరితహారం లో పండ్ల మొక్కలు నాటేందుకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.మరమ్మతులు పూర్తి కాగానే వైట్ వాష్ వేయిం చాలన్నారు. పాఠశాలల్లో జరుగుతున్న పనుల ఫోటోలు పనులు ప్రారంభించడానికి ముందు,పనులు జరుగుతున్న సమయంలోను, పనులు పూర్తి అయిన తరువాత మూడు రకాల ఫోటోలను భద్రపరచాలని ఆయన పేర్కొన్నారు. పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు ఉండాలని తెలిపారు. కలెక్టర్ తరగతి గదులన్ని తిరిగి పరిశీలించారు.ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి నీలకంఠం,సిబ్బంది పాల్గొన్నారు.

ఐఎన్టీయూసీ బెల్లంపల్లి రీజియన్ ఇంచార్జ్ గా కాంపెల్లి సమ్మయ్య

సన్మానించిన యూనియన్ నేతలు



టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-

సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్(ఐఎన్టీయూసీ)బెల్లంపల్లి రీజియన్ ఇంచార్జ్ గా యూనియన్ కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య నియమితులయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో యూనియన్ నాయకులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సమ్మయ్య మాట్లాడుతూ, సింగరేణి వ్యాప్తంగా కార్మికులు కాంగ్రెస్ పార్టీకి 12 అసెంబ్లీ స్థానాల్లో విజయం అందించారని, అదే విధంగా సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో సైతం 11 ఏరియాలకు గాను 6 ఏరియాలో కాంగ్రెస్ అనుబంధ ఐఎన్టీయూసీ విజయం సాధించిందని గుర్తు చేశారు. సింగరేణి కార్మికుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారం, సింగరేణి అభివృద్ధికై సింగరేణి వ్యాప్తంగా ఐఎన్టీయూసీని బలోపేతం చేసే దిశగా సింగరేణిలోని మూడు రీజియన్ లకు యూనియన్ ఉపాధ్యక్షులను ఇన్చార్జిలుగా నియమించడం జరిగిందని తెలిపారు. బెల్లంపల్లి రీజియన్ పరిధిలో యూనియన్ ను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. సింగరేణి కార్మికులకు సొంతింటి పథకం అమలు, ఐటి మినహాయింపుల నుండి ఊరట, సంస్థకు నూతన గనులు తదితర సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు, సింగరేణి వ్యాప్తంగా యూనియన్ ను బలోపేతం చేసేందుకే కాంగ్రెస్ పార్టీ, ఐఎన్టీయూసీ యూనియన్ ఆ దిశగా కసరత్తు ప్రారంభించిందని తెలిపారు. ఎన్నికల్లో కార్మికులకు ఇచ్చిన హామీల అమలకు కాంగ్రెస్ పార్టీ, ఐఎన్టీయూసీ యూనియన్ కట్టుబడి ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కేంద్ర కమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రాంశెట్టి నరేందర్, ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లూరి లక్ష్మణ్, సునార్కార్ రాంబాబు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జనరల్ న్యూస్
GENERAL NEWS
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దినపత్రిక
మంగళవారం, 28-05-2023

భూగర్భ డ్రైనేజీ పనులను పరిశీలించిన కార్పొరేటర్ కళ్లెం

టైమ్స్ ఆఫ్ వార్త - ఎల్బీనగర్ ప్రతినిధి:

హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి డివిజన్ పరిధిలోని సూర్య నగర్ లో జరుగుతున్న నూతన భూగర్భ డ్రైనేజీ పైప్ లైన్ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని,అదేవిధంగా రానున్న వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని భూగర్భ డ్రైనేజీ పైప్ లైన్ నిర్మాణ పనులు వీలైనంత త్వరగా పూర్తిచేయాలని అధికారులకు తెలపడం జరిగింది.ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ రాజు, సూపర్వైజర్ బాలు నాయక్,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

శుభోదయ కాలనీలో శిథిలావస్థకు చేరుకున్న విద్యుత్ స్తంభం

టైమ్స్ ఆఫ్ వార్త - ఎల్బీనగర్ ప్రతినిధి:

హయత్ నగర్ డివిజన్ పరిధిలోని శుభోదయ కాలనీ రోడ్ నెంబర్ వన్ లో విద్యుత్ స్తంభం శిథిలావస్థకు చేరుకుందని, పాత విద్యుత్ స్తంభం తొలగించి కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలని శుభోదయ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఇట్టగోని నరసింహ విద్యుత్ శాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం బలంగా వీచిన ఈదురు గాలులు వర్షానికి కాలనీ గల్లీలో గల చెట్టుకొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ తీగలు కిందికి జారీ ప్రమాదకరంగా ఉన్నాయని,ఈ విద్యుత్ స్తంభం మరో విద్యుత్ స్తంభానికి మధ్య దూరం పెరగడంతో శిథిలావస్థకు చేరుకున్నా స్తంభంపై భారం పడి ఒక పక్కకు ఒరిగిందని శిథిలావస్థకు చేరుకున్న స్తంభానికి మరో స్తంభానికి మధ్య కొత్త స్తంభం ఏర్పాటు చేయాలని వారు తెలిపారు. గతంలో విద్యుత్ స్తంభం ఒక ప్రక్కకు వంగకుండా తాత్కాలికంగా పక్కన గల వేప చెట్టుకు ఒక వైర్ తాత్కాలికంగా ఏర్పాటు చేసి సపోర్టుగా ఉంచడం జరిగిందన్నారు.ఆదివారం కురిసిన భారీ వర్షాలకు ఈదురు గాలులకు కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారని సమస్య పరిష్కారానికి విద్యుత్ శాఖ అధికారులు చొరవ చూపాలని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు విజ్ఞప్తి చేశారు. శుభోదయ కాలనీ సంక్షేమ సంఘం కార్యదర్శి ఈసం. శంకర్,కోశాధికారి పుట్ట శ్రీరాములు,గోపాల్ రాజ్ ఉన్నారు.

పాఠశాలలో పనులను నాణ్యతతో పూర్తి చెయ్యాలి

మండల ప్రత్యేకాధికారి నందకుమారి...

టైమ్స్ ఆఫ్ వార్త - ఎడపల్లి

ఎడపల్లి మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కింద చేపట్టిన పనుల విషయంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చేసిన ఆదేశాలను,నాణ్యతను కాంట్రక్టర్లు పాటించాలని మండల ప్రత్యేకాధికారి నందకుమారి అన్నారు. సోమవారం ఎడపల్లి మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను ఆమె సందర్శించారు.ఈ సందర్భంగా ఆమె పాఠశాలలోజరుగుతున్న పనులను పరిశీలించారు.పనులు నాణ్యతగా చేపట్టాలని తరగతి గదులలో,టాయిలెట్ల నిర్మా ణంలో టైల్స్ వాడొద్దని,సిసి ఫ్లోరింగ్ మాత్రమే చేయాలని ఆమె ఆదేశించారు.పనులు వచ్చే నెల 12లోగా పూర్తి చేయాలని కోరారు.ఆమెవెంట ఏఈ,ఉపాధ్యాయులు,ఉన్నారు.

బెల్లంపల్లి ఎంఈఓ ను వెంటనే సస్పెండ్ చేయాలి



టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-

జిల్లాలోని బెల్లంపల్లి మండలం, పట్టణంలో ఎలాంటి విద్యాశాఖ అనుమతులు లేకుండానే ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాల ఏర్పాటు అవుతున్న, మండల ఎంఈఓ అధికారి చూసి చూడనట్లు వ్యవహరిస్తూ, ప్రైవేట్ పాఠశాలలకు కొమ్ముకాస్తున్నారని, వెంటనే ఆయనను సస్పెండ్ చేయాలని జాతీయ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ సల్మాన్ పాషా డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం కార్యాలయ ఏఓ రాజేశ్వర్ కు వినతిపత్రం అందజేశారు. అనంతరం పాషా మాట్లాడుతూ, బెల్లంపల్లి పట్టణంలో నూతనంగా అభ్యాస పాఠశాలను విద్యాశాఖ నుండి, ఇతర శాఖల నుండి ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తున్నారని, జిల్లా విద్యాధికారికి ఫిర్యాదు చేయగా, ఆయన మండల ఎంఈఓ కు అనుమతులు లేని పాఠశాలలను మూసివేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. కానీ ఎంఈఓ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, సదరు ప్రైవేటు పాఠశాలలతో లాలూచీ పడి, ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వెంటనే సదరు ఎంఈఓ పై చర్యలు తీసుకొని, ఆయనను సస్పెండ్ చేయడంతో పాటు అభ్యాస పాఠశాల యాజమాన్యంపై సైతం చట్ట రీత్యా చర్యలు తీసుకొని, పాఠశాలను సీజ్ చేసి, అనుమతులు సైతం ఇవ్వద్దన్నారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో బిసి విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నస్పూర్ అఖిల్, నాయకులు రియాజ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గాలివానకు నేలమట్టమైన గుడిసె వాసుల బతుకులు

గుడిసెకు 50 వేల రూపాయల నష్టపరిహారం ప్రభుత్వం చెల్లించాలి.. అండగా ఉంటాం అధైర్య పడవద్దు..

గుడిసె వాసులకు భరోసా కల్పించిన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి

టైమ్స్ ఆఫ్ వార్త - ఎల్బీనగర్ ప్రతినిధి:

పుట్టిన ఊరిలో పనులు లేక బ్రతుకుతెరువు కోసం పట్టణానికి వలస వచ్చి కూలి నాలి పనులు చేసుకుంటూ చాలీచాలని కూలితో ఇంటి అద్దె చెల్లించలేక పిల్లలకు నాణ్యమైన విద్యను అందించలేక కనుచూపు మేరలో భవిష్యత్తు అంధకారంగా కనిపిస్తున్న తరుణంలో ఎన్ని కష్టాలు ఎదురైనా సొంతింటి కల నెరవేర్చుకోవాలని ఏకైక లక్ష్యంతో దినసరి కూలీలు, హమాలీలు లారీ ఆటోల డ్రైవర్లు ఇలా ఎందరో పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ కుంట్లూరు రెవిన్యూ పరిధి రావి నారాయణరెడ్డి కాలనీ పరిధిలోని భూదాన్ భూమిలో భూ పోరాటానికి గత 18 నెలల క్రితం శ్రీకారం చుట్టడం జరిగింది. నిరుపేదల భూ పోరాటానికి సిపిఐ పార్టీ అండగా ఉండి వారు లక్ష్యానికి చేరుకునేలా అన్ని విధాలుగా అండదండలు అందిస్తుంది. గత 18 నెలలుగా ఎండకు ఎండకు వానకు తడుస్తూ చలికి వణుకుతూ విష జంతువుల మధ్య పిల్లాపాపల తో నిత్యం పోరాటం చేస్తూ సొంతింటి కల సాకారం చేసుకోవాలనే ఏకైక లక్ష్యంతో ముందుకు వెళుతున్నారు.ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం సమయంలో ప్రకృతి సైతం నిరుపేదలపై కన్నెర్రచేసి భారీ ఈదురు గాలులు వర్షం రూపంలో నిరుపేదల గుడిసెలపై తన ప్రతాపాన్ని చూపించింది. దీంతో తినడానికి తిండి లేకపోయినా అప్పు సోప్పు చేసుకుని నిరుపేదలు గుడిసెలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్న గుడిసెలు ఒక్కసారిగా చెల్లాచెదురు కావడంతో వారి ఆవేదన వర్ణాతీతంగా మారింది.గత బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం లో సీఎం కేసీఆర్ తమ బాధలను పట్టించుకోలేదని,ఇప్పుడు ప్రకృతి సైతం తమ జీవితాలతో చెలగాటమాడుతుందని గుడిసెలు వేసుకున్న నిరుపేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా రావి నారాయణరెడ్డి కాలనీ ఫేస్ త్రీ లో ఎన్ని అడ్డంకులు అవాంతరాలు ఎదురైన మొక్కవోని ఆత్మస్థైర్యంతో భూ పోరాటాన్ని ముందుండి నడిపిస్తున్న సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి సోమవారం భూ పోరాట గడ్డపై పార్టీ శ్రేణులు మహిళా సమాఖ్య నాయకురాళ్లతో కలసి గుడిసె గుడిసెను పరిశీలించి భారీ ఈదురు గాలులు వర్షానికి గుడిసెలు వంట సామాగ్రి, పరదాలు కొట్టుకుపోయి రోడ్డున పడ్డ నిరుపేద గుడిసె వాసులను ఆయన పలకరించి వారికి భరోసా కల్పించారు.ఈ సందర్భంగా అందోజు రవీంద్ర చారి మాట్లాడుతూ సర్వేనెంబర్ 215 నుండి 224 వరకు గల 100 ఎకరాల భూదాన్ భూమిలో నిరుపేదలు గత 18 నెలల క్రితం గుడిసెలు వేసుకొని భూ పోరాటంలో పాల్గొంటున్నారని ఆయన అన్నారు. ఆదివారం భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం కారణంగా గుడిసెలు పూర్తిగా నేలమట్టం అయ్యాయని, వారి వంట సామాగ్రి తినే వంట పదార్థాలు మట్టి పాలు అయ్యాయన్నారు. మొత్తం ఎనిమిది వేల గుడిసెల్లో రెండున్నర వేల గుడిసెలు పూర్తిగా నేలమట్టం అయ్యాయని,మరో వెయ్యి గుడిసెలు పాక్షికంగా దెబ్బతిన్నాయని అన్నారు. భూదాన్ భూమిపై కోర్టులో కేసులు ఉన్నావంటూ గుడిసెలు వేసుకున్న భూమిలో బోర్లు వేయకుండా మంచినీటి సౌకర్యం కల్పించకుండా భోజనాలు చేయకుండా రెవెన్యూ అధికారులు ఆంక్షలు విధించిన నిరుపేదలు మొక్కవోని ధైర్యంతో ముందుకు వెళుతున్నారన్నారు. గత కెసిఆర్ ప్రభుత్వం నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వకుండా గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు న్యాయం చేయకుండా తప్పించుకుందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమ ప్రభుత్వం అని

చెబుతున్న సీఎం రేవంత్ రెడ్డి మానవతా దృక్పథంతో ఆలోచించి భూదాన్ భూమిలో గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు న్యాయం చేయాలని ఆందోజు డిమాండ్ చేశారు.భూ పోరాటాన్ని విచ్ఛిన్నం చేయాలని కుట్రలకు ప్రైవేటు వ్యక్తులు పాల్పడుతున్నారని, ఎన్ని కుట్రలు కుతంత్రాలకు పాల్పడిన నిరుపేదల పక్షాన పోరాటం చేసి పేదలకు న్యాయం చేకూరేలా పోరాడుతామన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఏఐటీయూసీ నాయకులు అజ్మీర్ హరి సింగ్ నాయక్, సైదులు,దాసరి ప్రసాద్, రమావత్ సక్రు నాయక్, నారాయణ,కేతరాజు నరసింహ, నారాయణరెడ్డి, యాదగిరి,వట్టి నవనీత,కాటి అరుణ,దేవమ్మ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పనులను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్..

టైమ్స్ ఆఫ్ వార్త-బోధన్

అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా చేపడుతున్న పనులను బోధన్ మున్సిపల్ కమీషనర్ వెంకట నారాయణ పరిశీలించారు. సోమవారం పట్టణంలోని నర్సాపూర్, పాండుఫారంలో గల మండల ప్రజా పరిషత్ పాఠశాలలను సందర్శించారు. చేపడుతున్న పనులను పరిశీలించి, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరిత గతిన పనులు పూర్తి చేయాలని గుత్తేదారులను ఆదేశించారు. మున్సిపల్ ఇంజనీర్లు శ్రీనివాస్, శివకృష్ణ తదితరులున్నారు.

ఈ నెలాఖరి వరకు ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేస్తాం

అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు

టైమ్స్ ఆఫ్ వార్త - మెదక్ జిల్లా ప్రతినిధి

స్థానిక కౌడిపల్లి మండలంలోని కుకట్లపల్లి గ్రామంలో దాన్యం కొనుగోలు సెంటర్ ను సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడ ుతూ ధాన్యం కొనుగోలు లో సరైన తేమ శాతం నమోదు చేయాలని ,ధాన్యం కొలుగోలులో రైతుల అధైర్య పడద్దని రైతులకు అండగా ఉంటామని, ధాన్యం చివరి గింజ వరకు కొంటామని, . జిల్లాలో ధాన్యం సేకరణ ఈనెల ఆఖరి వరకు పూర్తి చేస్తామన్నారు. ధాన్యం కొనుగోలులో రవాణా కోసం ఇతర జిల్లాల నుంచి అదనపు వాహనాలు తెప్పించామని, అదనపు వాహనాలలో లోడింగ్ నడుస్తుందన్నారు. దళారులను నమ్మొద్దని, కొనుగోలు కేంద్రంలో అన్ని సౌకర్యం కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠాలు నేర్చేదెన్నడు..?

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:



మట్టిముద్దల్లాంటి విద్యార్థులను విజ్ఞాన గనులుగా మలచే కీలక బాధ్యత గురువులది. వేరే మాటల్లో ఫుల్ స్టాప్ ఒక దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే రూపుదిద్దుకొంటుంది. సమాజానికి దిక్సూచి లాంటి ఉపాధ్యాయులకు ఆధునిక అవసరాలకు అను గుణంగా సరైన శిక్షణ అందించడం విద్యావ్యవస్థకు ప్రాణా వసరం. ఈ బృహత్తర యజ్ఞం దేశీయంగా ప్రహసనంగా మారిం దన్నది కాదనలేని సత్యం. ఇండియాలో ఉపాధ్యాయ శిక్షణ సంస్థలకు ధనార్జన మీద ఉన్న ధ్యాస నిజమైన నైపుణ్యాలు అలవరచడంపై కొరవడింది. తూతూ మంత్రంగా కోర్సులు నిర్వహించి, ధ్రువపత్రాలు జారీ చేసి, అవి చేతులు దులుపుకొం టున్నాయి. వాటిని నియంత్రించాల్సిన జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి (ఎన్‌సీటీఈ) చేష్టలుడిగి చూస్తోంది. తత్ఫలితంగా జాతికి తీరని అన్యాయం జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఫ్యూచర్ స్కిల్స్ సబ్జెక్టు, సీబీఎస్‌ఈ సిలబస్ అంటూ హడావుడి చేసిన జగన్ సర్కారు- వాటిని బోధించేవారిని తయారుచేసే బీఈడీ, డీఈడీ పాఠ్యాం శాలను మాత్రం మార్చకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీఈడీ అభ్యర్థులు ప్రాక్టికల్ పరీక్షల్లో భాగంగా ప్రభుత్వ బడులకు వెళ్ళి పాఠాలు చెబుతారు. బోధన నైపుణ్యాలకు సానపట్టే ఈ విధానానికీ మంగళం పలుకుతున్న మాయాజా లాలు ఆందోళన రేపుతున్నాయి. ఇండియాలో ఇలా ఎన్నో ఉపాధ్యాయ శిక్షణ సంస్థల భ్రష్టపోకడలను అజీమ్ ప్రేమ్ జీ విశ్వవిద్యాలయ అధ్యయనం గతంలోనే తెలియజెప్పింది. వాస్తవానికి ఇండియాలో శిక్షణ ప్రక్రియకు సంబంధించి ఉపాధ్యాయుల అభిప్రాయాలను ఏమాత్రం పరిగణలోకి తీసుకోవ డం లేదని పరిశీలనలు చాటుతున్నాయి. అందుకే పెద్దసంఖ్యలో టీచర్లు ప్రస్తుత విధానంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. , ప్రభుత్వాల నిర్లక్ష్యం, శిక్షణ సంస్థల నిర్వాకాలు బడిచదువుల్లో భారత్‌ను పాతాళపు లోతులకు నెట్టుకుపోతున్నాయి. దాదాపు పదిహేను లక్షల ప్రభుత్వ, ప్రైవేటు బడులు, 26 కోట్ల పిల్లలతో తులతూగుతున్న అతి పెద్ద పాఠశాల విద్యావ్యవస్థ మనది. , ఆయా స్థాయిలన్నీ కలిపి 95 లక్షల మందికి పైగా ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారు. ప్రాథమిక, ప్రాథమి కోన్నత స్థాయిలో సరైన శిక్షణ లేని టీచర్లు 11శాతం మేర ఉన్నట్లు అధికారిక గణాంకాలు గతంలో వెల్లడించాయి. ఉపాధ్యా యులకు నిరంతరాయంగా శాస్త్రీయ శిక్షణ అందిస్తూ ఫిన్‌లాండ్ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోంది. అమెరికా, జర్మనీ వంటివి అత్యుత్తమ ప్రమాణాలు కలిగిన బడులతో పిల్లలకు ఆసక్తి కలిగిన రంగాల్లో వారిని తీర్చిదిద్దుతున్నాయి. అందుకే అక్కడ పెద్ద సంఖ్యలో శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలు ఉద్భవిస్తున్నారు. దీనికి భిన్నంగా భారత్‌లో వేలాది బడులు తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస వసతులకు నోచుకోక పిల్లలకు నరకం చూపిస్తున్నాయి. లక్షల సంఖ్యలో బోధన సిబ్బంది ఖాళీలతో అవి కునారిల్లుతున్నాయి. ఈ దుస్థితి తప్పాల ంటే- విద్యారంగానికి సమధిక కేటాయింపులు జరపాలి. , సిబ్బందిలో నైపుణ్యానికి, విజ్ఞానానికి ప్రోదిచేయడంతో పాటు సరికొత్త బోధన పద్ధతులను అవలంబించడానికి ఉపాధ్యాయ శిక్షణ తోడ్పడుతుంది.దీనిపై భారత్‌లో దశాబ్దాలుగా నెలకొన్న అలక్ష్యం దేశానికి తీవ్ర చెరుపు చేస్తోంది. సమర్థ వాగ్ధాటి, అపార జ్ఞాపకశక్తి, మేధస్సుతో పాటు విద్యార్థుల ఉజ్జ్వల భవితకోసం తపించే ఉపాధ్యాయులే దేశానికి దారిదీపాలు. , దురదృష్టవశాత్తు చాలామంది గురువుల్లో ఈ స్ఫూర్తి లోపించినందువల్లే పిల్లలపట్ల దుర్విచక్షణ, వారిపై అకృత్యాలు వంటివి వెలుగు చూస్తూ భారతీయ విద్యావ్యవస్థకు మాయని మచ్చలుగా మారుతున్నాయి. , ఈ దురవస్థను తప్పించాలంటే మన ఉపాధ్యాయ శిక్షణను సమూలంగా ప్రక్షాళించాలి. గురువుల ఎంపిక ప్రక్రియ నుంచే తగిన జాగ్రత్తలు తీసుకొని, ఎప్పటికప్పుడు వారికి మేలిమి శిక్షణ అందించే అత్యుత్తమ వ్యవస్థను కొలువుతీర్చాలి. ఆ మేరకు పాలకులు చిత్తశుద్ధి చాటుకుంటేనే మన చదువుల తీరుతెన్నులు మారేది!

జనరల్ న్యూస్
GENERAL NEWS
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దినపత్రిక
మంగళవారం, 28-05-2023

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:

పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని 3వ జోన్ కు చెందిన మేకల రవి (47) మద్యానికి బానిసై, గడ్డి మందు తాగి, ఆత్మహత్య చేసుకొని, మృతి చెందాడు. పట్టణ ఏఎస్ఐ మజీద్ మాట్లాడుతూ, కూలి పని చేసుకుని జీవించే రవి మద్యానికి బానిసై, తాగడానికి డబ్బులు కావాలంటే తరచు భార్యను వేధించే వాడని, ఆదివారం సైతం మద్యం తాగేందుకు డబ్బులు కావాలని భార్యతో గొడవ పడ్డాడని తెలిపారు. ఆమె డబ్బులు ఇవ్వకపోవడంతో మద్యం మత్తులో గడ్డి మందు తాగి, ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. కుటుంబ సభ్యులు వెంటనే రవి ని హుటాహుటిన ఆసుపత్రికి తీసుకు వెళు ్తండగా, మార్గమధ్యంలో మృతి చెందాడని తెలిపారు. ఈమేరకు రవి కుటుంబ సభ్యులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ మజీద్ కేసు నమోదు చేయగా, దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఎస్ఐ ఎస్ రాజశేఖర్ తెలియజేశారు.

నూతన బుక్ స్టాల్, స్టేషనరీ షాప్ ప్రారంభం

టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:

యూఎఫ్ఏ మహిళా స్వయం సహాయక పొదుపు శిక్షణ, ఉపాధి సంస్థ ప్రోత్సాహంతో పట్టణంలోని పాత బస్టాండ్ శివాని ఉన్నత పాఠశాల సమీపంలో యుఎఫ్ఏ ఇన్ఫోసిస్ పేరుతో జే స్వర్ణలత, బి భాగ్యలక్ష్మి లు నూతనంగా బుక్ స్టాల్, స్టేషనరీ షాపు ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యుఎఫ్ఏ వ్యవస్థాపకులు యూఎఫ్ఏ యాకూబ్ పాషా, మహిళా చైర్ పర్సన్ జాడి కళ్యాణి, రాష్ట్ర కోశాధికారి ఫౌజియా బేగం లు హాజరై, రిబ్బన్ కట్ చేసి, షాపును ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ,యూఎఫ్ఏ ప్రోత్సాహంతో ప్రారంభించిన షాపు దినదిన అభివృద్ధి చెంది, వారు మంచి లాభాలు ఆర్జించి, ఆర్థికంగా నిలదొక్కుకొని, ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో షాప్ నిర్వాహకులు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీకి వచ్చేది 20 సీట్ల కంటే తక్కువే

(మొదటి పేజీ తరువాయి)..

వయనాడ్ నుంచే పోటీ చేస్తానని ఆయన స్పష్టం చేశారని వివరించారు. ఐయూఎంఎల్ గత 48 ఏళ్లుగా కాంగ్రెసతో కలిసి నడుస్తోందని, ఇండియా కూటమికి కేరళ యూడీఎఫ్ రోల్ మోడల్ అని చెప్పారు. ప్రేమ వీధిలో మతతత్వ శక్తులు విద్వేష దుకాణాన్ని తెరిచేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో స్నేహ సదస్సు వంటి పుస్తకాన్ని రాసిన తంగల్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. దేశాన్ని, సంస్కృతిని, తర్వాతి తరాలను కాపాడుకునేందుకు మతతత్వ శక్తులతో కేరళ ప్రజలు చేస్తున్న పోరాటం నుంచి తానూ ఎంతో కొంత నేర్చుకోవాలని అనుకుంటున్నానని చెప్పారు. "దేశ ప్రధాని హోదాలో ప్రజలందరి ప్రయోజనాలను కాపాడడం, వివిధ మతాలకు చెందిన వారందరినీ కలుపుకొని పోతూ దేశాన్ని ముందుకు తీసుకెళ్లడం మోదీ బాధ్యత. గడిచిన పదేళ్లుగా ప్రధానిగా కొనసాగుతున్న ఆయన.. దేశంలోని కొంత మందికి వ్యతిరేకంగా మాట్లాడడం దేశానికి మంచిది కాదు" అని తప్పుబట్టారు. మతతత్వ శక్తులను చొప్పించేందుకు బీజేపీ ఎంత ప్రయత్నించినా వారికి ఒక్క ఇంచు కూడా జాగా ఇవ్వని కేరళ సమాజం.. హిందుస్థాన్‌కు రోల్ మోడల్ అని అన్నారు. కేరళ సిస్టం నుంచి దేశం నేర్చుకోవాల్సింది ఎంతో ఉందన్నారు. కేరళ మోడల్ పాలిటిక్స్ దేశానికి చాలా అవసరమన్నారు.

అక్రమంగా ఇన్సులిన్ అమ్మకాలు

(మొదటి పేజీ తరువాయి)..

రూ. 16 లక్షలు విలువైన స్టాక్‌ను డిసిఎ అధికారులు ఇటీవల స్వాధీనం చేసుకున్నారు. సరైన డాక్యుమెంటేషన్ లేకపోవడం వల్ల ఔషధాల నాణ్యత, ప్రామాణికత, భద్రతను ధృవీకరించడం ఎట్టి పరిస్థితుల్లో సాధ్యపడదు, పైపెచ్చు ఇది వినియోగదారులకు ప్రమాదాలను కలిగించే ఆస్కారం ఎక్కువగా ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

ఐదు రోజుల్లో కేరళకు రుతుపవనాలు

(మొదటి పేజీ తరువాయి)..

వర్షం కురిసింది. రాగల 2 రోజులు రా ష్ట్రంలో పొడి వాతావరణం ఉండే అవకాశాలు ఉన్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉష్ణోగ్రతలు రెండు మూడు డిగ్రీలు పెరిగే అవకాశాలు ఉన్నట్టు తెలిపింది.సోమవారం రాష్ట్రంలో గిరిష్టంగా మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో 45.7డిగ్రీలు నమోదైంది.

ప్రభుత్వ పాఠశాలలు.. ఉజ్వల భవిష్యత్తుకు బాటలు

'పది' ఫలితాల్లో సత్తా చాటిన సర్కారు బడులు.. 10 జీపీఏ సాధించిన 103 మంది విద్యార్థులు

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ విద్యావిభాగం

ప్రభుత్వ పాఠశాలలు అంటే విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో నెలకొని ఉండే అపనమ్మకం క్రమేణా దూరమవుతోంది. ఆర్థిక స్థోమత లేని పేద కుటుంబాలకు చెందిన పిల్లలే ప్రభుత్వ బడులలో చదువుతారనే భావన చెరిగిపోతూ, ప్రజల ఆలోచనలు, అభిప్రాయాలలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. మధ్య తరగతి వారితో పాటు, సంపన్న శ్రేణికి చెందిన అనేక కుటుంబాలు సైతం తమ బిడ్డల ఉజ్వల భవిష్యత్తును కాంక్షిస్తూ వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చదివించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి అత్యుత్తమ ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు ట్రిపుల్ ఐ.టీ వంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థలలో ప్రవేశాలు లభిస్తుండడం, జవహర్ నవోదయ విద్యాలయాలలో చదువుకునే అవకాశం లభిస్తుండడం అందరినీ ఆలోచింపజేస్తోంది. నాణ్యమైన బోధన, మెరుగైన మౌలిక సదుపాయాలతో ప్రభుత్వ పాఠశాలలు ఏటికేడాది ఉత్తమ ఫలితాలను సాధిస్తుండడం ఈ మార్పునకు కారణం అవుతోంది. ప్రైవేటు బడులకే పరిమిత మైన ఆంగ్ల మాధ్యమ బోధన ప్రభుత్వ పాఠశాలల్లోనూ అందుబాటులోకి రావడంతో అనేక మంది మొగ్గు చూపుతున్నారు. హంగు, ఆర్భాటాలతో హడావుడి చేసే ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా నిజామాబాద్ జిల్లాలోని ప్రభుత్వ బడులు అద్వితీయ ఫలితాలను నమోదు చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఇటీవలే ప్రకటించిన 2024 పదవ తరగతి వార్షిక ఫలితాలలో సర్కారీ బడులలో చదివిన విద్యార్థిని, విద్యార్థులు ప్రైవేటు పాఠశాల సైతం విస్తూపోయేలా తమ సత్తా చాటారు. ఒకరు కాదు.. ఇద్దరు కాదు ఈ ఒక్క జిల్లా నుంచే ఏకంగా 103 మంది బాలబాలికలు 10/10 జీ.పీ.ఏ సాధించడం విశేషం. ప్రభుత్వ పాఠశాలల్లో గణనీయంగా మెరుగుపడిన విద్యా ప్రమాణాలకు ఈ ఫలితాలు తార్కాణంగా నిలిచాయి. మహాత్మా జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులతో పాటు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్ళు, మైనారిటీ రెసిడెన్షియల్ బడులలో చదివిన అనేకమంది బాలబాలికలు 10 గ్రేడ్ పాయింట్లు సాధించి సత్తా చాటారు.

అన్నింటికి మించి రెసిడెన్షియల్, ఆదర్శ పాఠశాలలే కాకుండా ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు సైతం 10/10 గ్రేడ్ పాయింట్స్ సాధించి సర్కారీ బడుల ఖ్యాతిని చాటారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ బడులలో మౌలిక వసతుల కల్పన పనులను చేపట్టి అన్ని సౌకర్యాలను మెరుగుపర్చడం, ఉ పాధ్యాయుల బోధనా సామర్థ్యం పెంపుపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తుండడం సత్ఫలితాలు సాధనకు దోహదపడుతోంది. ఉపాధ్యాయులు సైతం సర్కారీ బడులలో నాణ్యమైన విద్యను బోధిస్తూ విద్యార్థులు స్వచ్ఛందంగా ప్రవేశాల పట్ల ఆకర్షితులయ్యేలా కృషి చేస్తు న్నారు. అన్ని వసతులతో కూడిన ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థులకు క్రీడలలోనూ భాగస్వామ్యం చేస్తూ, వారి శారీరక, మానసిక అభివృద్ధికి దోహదపడు తున్నారు. అన్నింటికి మించి పదవ తరగతి విద్యార్థులకు సాధారణ తరగతులతో పాటు స్పెషల్ క్లాసెస్ నిర్వహిస్తూ అత్యుత్తమ ఫలితాలు సాధించేలా జిల్లా పాలనాధికారి పర్యవేక్షణలో జిల్లా విద్యా శాఖ ప్రత్యేక కృషిని కొనసాగిస్తుండడం సత్ఫలితాలను అందిస్తోంది.

ప్రభుత్వ బడులలో చదివి 10 జీ.పీ.ఏ సాధించిన విద్యార్థులు వీరే

బాల్కొండలోని మహాత్మా జ్యోతిబాపూలే ప్రభుత్వ బాలికల సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో చదివిన ముదావత్ అఖిల, జిందం ప్రీతి, కటకం సాహితీ, కచ్చకాయల సాహితీ, ఆర్మూర్ రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన తలారి షాలిని, చిమన్పల్లి పాఠశాలకు చెందిన పి.అమూల్య, సాలూర ఎం.జె.పీకి చెందిన డి.అపర్ణ, పి.గౌతమి, పి.హర్షశ్రీ, ఎడపల్లి బాలుర రెసిడెన్షియల్ స్కూలుకు చెందిన అభ్యుదయ్, రాంపూర్ పాఠశాలలో చదివిన డి.నిశాంత్ రెడ్డి, కంజర బాలుర రెసిడెన్షియల్ స్కూల్ కు చెందిన ఎన్. సూరజ్ గౌడ్, కొండపల్లి కార్తీక్, నూత్పల్లి వద్ద గల ఎం.జె.పీ పాఠశాలలో చదివిన చరణ్ తేజ, జి. రాఘవేంద్ర, ఎస్. గణేష్, ఎం. భరణి, తాళ్ల బాలు తేజ, గైని శివచరణ్, కంజర ఎం.జె.పి స్కూల్ కు చెందిన కె. కార్తీక్, ఆర్. శ్రీచక్ర, దాస్ నగర్ లోని ఎం.జె.పిలో చదివిన అంకిత, ముదావత్ పల్లవి, గంగుల జీవని, ఎం. మహేశ్వరి, టి. రేణుశ్రీ, పెర్కిట్ కేజీబీవీకి చెందిన ఎం.సిరి, ఇందల్వాయి కేజీబీవీలో చదివిన ఏ. సాత్విక, డిచ్పల్లి మోడల్ స్కూల్ కు చెందిన చాట్ల చందన, మెగావత్ పల్లవి, ఎం. అమూల్య, ధర్పల్లి ఆదర్శ పాఠశాలకు చెందిన లోలం మేఘన, ఎస్. అంకిత, అక్షయ, జక్రాన్పల్లి మోడల్ స్కూల్ లో చదివిన ఎం. మాధురి, మామిడిపల్లి మోడల్ స్కూల్ లో చదివిన ఆఫియా ఫిర్దోస్, సయ్యద్ అహ్మద్, జక్క వాసవి. వేదశ్రీ, అంకం కీర్తి, రోహిణి, సాయి పునీత్, పోచంపాడ్ లోని బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో చదివిన ఏ. వైష్ణవి, బి. వర్షిత, ఎడపల్లి ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన కె. నితీష, రమ్య, బాల్కొండ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ లో చదివిన జి. సింధు, కె. సాహితి, ఆలూర్ లోని మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ కు చెందిన మహమ్మద్ షానవాజ్, వరుణ్, మాలావత్ అభిషేక్, కె. సంజీవ్ కుమార్, ఎన్. మణికంఠ గౌడ్, కేతావత్ అన్విత్, బాల్కొండ పాఠశాలకు చెందిన ఎన్. అభిత, ధర్మారంలోని బాలికల రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన పి. వనిత, పోచంపాడ్ బాలికల రెసిడెన్షియల్ స్కూల్ లో చదివిన డి. ఐశ్వర్య, జి. లాస్య, ఎస్. అను, మధునయన, ఎం. అను రాధ, చాట్ల అలేఖ్య, ఎస్. అనన్య, కంజరలోని బాలికల రెసిడెన్షియల్ స్కూల్ లో చదివిన కె. శ్రీవర్ష, సుద్దపల్లిలోని బాలికల రెసిడెన్షియల్ స్కూల్ కు చెందిన పెద్దోళ్ల మానస, బోర్గామ్ జెడ్పి హైస్కూల్ కు చెందిన చాట్ల దాక్షాయణి, ముప్కాల్ హైస్కూల్ లో చదివిన టి. ప్రశాంత్, నవీపేట్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ముబషీరా నాజ్, నబీలా నిషాత్, ఆలూర్ హైస్కూల్ లో చదివిన ఏ. సవిత, జి. భవజ్ఞ, దండు శరణ్య, సాయి మాధుర్య, మగ్గిడి రశ్మిత, ఎస్. దేవానంద్, ఇస్సాపల్లి హైస్కూల్ కు చెందిన లక్ష్మి ప్రసన్న, వేల్పూర్ హైస్కూల్ కు చెందిన నిశిత, ముప్కాల్ హై స్కూల్లో చదివిన కార్తికేయ చారి, రచన, పోచంపాడ్ స్కూల్ కు చెందిన యుస్రాఖాన్, మోతె హైస్కూల్ కు చెందిన రామకృష్ణ, బాల్కొండ హైస్కూల్ లో చదివిన హర్షిక, కమ్మరపల్లి హైస్కూల్ కు చెందిన మొహమ్మద్ ఫైజాన్, భీంగల్ గర్ల్స్ హైస్కూల్లో చదివిన కె. అపూర్వ, డొంకేశ్వర్ హైస్కూల్ కు చెందిన లవణ్ కుమార్, ప్రణవ్ తేజ్, నిశాంత్, తొండాకూర్ హైస్కూల్ కు చెందిన నాయని ఆకృతి, తల్వేద ఉన్నత పాఠశాలలో చదివిన తేజస్విని, డి. విష్ణువర్ధన్, డి. శ్రీజ, ఎస్. కృష్ణవి, ఐలాపూర్ స్కూల్ కు చెందిన కె. సాయికిరణ్, మొహమ్మద్ నుమాన్, పడకల్ హైస్కూల్లో చదివిన కె. హర్షిక, జి. శంకర్, వెల్మల్ హైస్కూల్ కు చెందిన టి. శ్రీనిత, ఎం. ఆకాంక్ష, ముచ్కూర్ హైస్కూల్ విద్యార్థులు కె. శ్రవణ్య, చేగంటి శివాని, ఎం. శ్రీవల్లి 10 జీపీఏ సాధించి తమ ప్రతిభను చాటారు.

ఐపీఎస్ సాధించడమే లక్ష్యం : సీహెచ్. అంకిత (దాస్ నగర్, మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాల విద్యార్థిని)

సివిల్స్ పరీక్షలు రాసి ఐ.పీ.ఎస్ సాధించడమే లక్ష్యంగా పెట్టుకు న్నాను. నా తల్లిదండ్రులు, గురు వుల తోడ్పాటుతో తప్పనిసరిగా లక్ష్యాన్ని సాధిస్తానని గట్టి నమ్మ కం ఉంది. పదవ తరగతిలో 10 గ్రేడ్ పాయింట్స్ సాధించడం ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించిం ది. ప్రస్తుతం ట్రిపుల్ ఐ.టీలో సీటు సాధించడంపై దృష్టి పెట్టాను. పాఠశాలలో చక్కటి ప్రణాళికతో అర్థమయ్యే విధం గా బోధన చేయడం అత్యుత్తమ మార్కుల సాధనకు దోహద పడింది. ఖో-ఖో, అథ్లెటిక్స్ లోనూ చక్కటి ప్రవేశం ఉండేలా తీర్చిదిద్దారు. తన ప్రతిభను గుర్తించిన ఉపాధ్యాయులు ఐ.ఐ.టీ తరగతులను అదనంగా బోధించే పఠాన్ చెరు, ఇంద్రేశం వద్ద గల ఎం.జె.పీలో తనను రెండేళ్ల పాటు చదివించారు. పదవ తరగతి పరీక్షలను తిరిగి దాస్ నగర్ పాఠశాల నుండే రాశాను. ఇదే స్ఫూర్తితో ముందుకెళ్తూ, తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తెస్తాను.

ఐ.ఐ.టీ లో సీటు సాధించడమే లక్ష్యంగా ముందుకెళ్తా పల్లవి (దాస్ నగర్, ఎం.జె.పీ పాఠశాల విద్యార్థిని)

వ్యవసాయ కుటుంబ నేపథ్యం కలిగిన తాను ప్రతిష్టాత్మక విద్యా సంస్థలో ఐ.ఐ.టీలో సీటు సాధిం చడమే లక్ష్యంగా పెట్టుకున్నాను. బాసరలోని ట్రిపుల్ ఐ.టీలో చదువుతున్న మా అన్నను స్ఫూర్తి గా తీసుకుని ఈ లక్ష్యాన్ని నిర్దేశిం చుకున్నాను. పదవ తరగతిలో 10 గ్రేడ్ పాయింట్స్ రావడానికి పాఠశాలలో ఉపాధ్యా యులు అందించిన బోధన ఎంతగానో దోహదపడింది. అన్ని వసతులను అందుబాటులో ఉంచుతూ, ప్రణాళికాబద్ధంగా పాఠాలను బోధించడం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయి. ఇదే స్ఫూర్తితో ముందుకెళ్తూ అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తానని పూర్తి నమ్మకం ఉంది.

తల్లిదండ్రుల కలను సాకారం చేస్తా : దాక్షాయణి (బోర్గాం, జెడ్పిహెచ్ఎస్ పాఠశాల విద్యార్థిని)

తాను గొప్ప ఇంజనీర్ అయి తల్లిదండ్రుల కలను సాకారం చేస్తాను. స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తే అనుకున్న గమ్యాన్ని సాధించవచ్చు. ఈ దిశగా కీలక మైన పదవ తరగతి వార్షిక పరీక్ష ల్లో 10 గ్రేడ్ పాయింట్స్ సాధించ డం ఆత్మవిశ్వాసాన్ని ద్విగుణీకృతం చేసింది. ఉపాధ్యాయులు అంకిత భావంతో పాఠ్యాంశాలు బోధిస్తూ క్రమశిక్షణను అలవర్చడం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయి. తన తండ్రి ఆటో డ్రైవర్, తల్లి గృహిణిగా కుటుంబాన్ని పోషిస్తున్నారు. భవిష్యత్తులో ఇంజనీర్ అయి వారికి చేయూతగా నిలుస్తాను.

జ్యోతిబాపూలే విద్యా సంస్థలోనే ఇంటర్ ప్రవేశం తీసుకున్నాను గంగుల జీవని, (దాస్ నగర్, ఎం.జె.పీ పాఠశాల విద్యార్థిని)

చక్కటితో ప్రణాళికతో బోధనను అందిస్తున్న దాస్ నగర్ వద్ద గల మహాత్మా జ్యోతిబాపూలే విద్యా సంస్థలోనే ఇంటర్మీడియట్ కోసం అడ్మిషన్ తీసుకున్నాను. ఇక్కడి ఉ పాధ్యాయులు అర్థమయ్యే రీతిలో బోధన చేయడమే కాకుండా అన్ని విధాలుగా ప్రోత్సహిస్తూ, చక్కటి భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు. నూటికి నూరు శాతం సిలబస్ ను పూర్తి చేసి, పరీక్షలకు ముందు పునఃశ్చరణ తరగతులు నిర్వహించడం, ఎలాంటి ఒత్తిడికి లోను చేయకుండా పాఠాలను సులభంగా ఆకళింపు చేసుకునేలా తర్ఫీదును ఇవ్వడం వల్ల పదవ తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు దోహద పడింది. వసతి, సదుపాయాల విషయంలోనూ ఎలాంటి లోటు లేకుండా ఇంటి వాతావరణాన్ని మరిపించారు. ఇప్పటికైతే మంచి మార్కులతో ఇంటర్ పూర్తి చేశాక, బీ.టెక్ చేయాలని నిర్ణయించుకున్నాను.

బీసీజీ టీకా పై ఒకరోజు శిక్షణ

ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్

టైమ్స్ ఆఫ్ వార్త మెదక్ జిల్లా ప్రతినిధి

జిల్లా జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పెద్దలకు టిబి వ్యాక్సినేషన్ కార్యక్రమ నిర్వహణపై జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులకు పర్యవేక్షణ అధికారులకు ఆశ నోడల్ పర్సన్ లకు టిబి నోడల్ పర్సన్ లకు ఎం ఎల్ హెచ్ పి లకు ఏర్పాటు చేసిన ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్ ప్రారంభించారు . ఈ సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి మాట్లాడుతూ జిల్లాలోని పెద్దలకు ఉచితంగా బి సి జి వ్యాక్సినేషన్ కు వీలుగా అవసరమైన కార్యాచరణ చురుగ్గా సాగుతుందని ఇప్పటికే వివిధ స్థాయిలలోని శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాము. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, వెల్నెస్ కేంద్రాలు ,వ్యాక్సినేషన్ కేంద్రాలలో వ్యాక్సిన్ ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు .ఒక కుటుంబంలో 18 సంవత్సరముల వయసు దాటిన వారిని 60 సంవత్సరముల వయసు పైబడిన వారిని పొగ త్రాగే వారు , మధుమేహ వ్యాధితో బాధపడే వారిని గుర్తించనున్నారు .తక్కువ బరువు ఉన్నవారు, ఐదేళ్లలో క్షయ ఔషధాలు వాడిన వారిని ,క్షయరోగితో సన్నిహితంగా మెలిగిన వారిని గుర్తించనున్నారు .ఇలాంటి వారికి బీసీజీ టీకాను అందించాలని వైద్యశాఖ నిర్ణయించినది. ఇట్టి కార్యక్రమంలో డాక్టర్ స్నేహ శుక్ల డబ్ల్యూహెచ్వో కన్సల్టెంట్, డాక్టర్ భాను స్టేట్ టిబి కోఆర్డినేటర్ ,డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ ఎస్ ఎం ఓ, డాక్టర్ విజయనిర్మల డిప్యూటీ డి ఎం హెచ్ ఓ నర్సాపూర్ ,డాక్టర్ అనిలా డిప్యూటీ డిఎంహెచ్వో మెదక్ ,డాక్టర్ అరుణ శ్రీ డిప్యూటీ డిఎంహెచ్వో తూప్రాన్ డాక్టర్ మాధురి జిల్లా ఎమినైజేషన్ అధికారిని, డాక్టర్ నవీన్ కుమార్ ప్రోగ్రాం ఆఫీసర్ ఫర్ టి బి, శ్రీనివాస్ డిప్యూటీ డెమో ,రమ హెల్త్ ఎడ్యుకేటర్ సునీల్ వివిధ పి హెచ్ సి వైద్య అధికారులు మరియు సూపర్వైజర్ లా స్టాఫ్ ఎం ఎల్ హెచ్ పి లు పాల్గొన్నారు

ట్యాపింగ్‌లో సంచలనాలు

(మొదటి పేజీ తరువాయి)..

అనుకున్నట్టు రాధాకిషన్‌రావు తన వాంగ్మూలంలో వెల్లడించారని తెలిసింది. అయితే కొంతమంది అధికారుల అసమర్థతవల్లే సంతోష్‌ను అరెస్ట్ చేయలేకపోయామని, పలువురు అధికారులను కేరళకు పంపించినా ప్రణాళికను విజయవంతం చేయలేదని, సంతోష్‌ను అరెస్టు చేయకపోవడంపై కెసిఆర్ అసహనం వ్యక్తం చేసినట్లు రాధాకిషన్‌రావు వివరించినట్లు తెలిసింది. కెసిఆర్‌తో ఉన్న అనుబంధం వల్ల ఇంతకంటే ఎక్కువ విషయాలను చెప్పలేనని రాధాకిషన్ రావు తన వాంగ్మూలంలో పేర్కొన్నట్టు సమాచారం. అదే విధంగా బిఆర్ఎస్‌కు ఇబ్బందిగా మారిన వ్యక్తుల ఫోన్లను నిఘా పెట్టినట్లు రాధాకిషన్ రావు ఒప్పుకున్నట్లు అధికారులు ప్రకటించారు. ఇక మీడియా యజమానులకు కూడా వదల్లేదని, కీలక ఛానళ్ల యజమానుల ఫోన్లు ట్యాప్ చేసినట్లు తెలిపారు. బిఆర్ఎస్ పార్టీని ట్రోలింగ్ చేసినవారిని కూడా టార్గెట్ చేసినట్లు ప్రణీత్ రావు వెల్లడించారు. కుత్బుల్లాపూర్ ఎంఎల్ఎతో విభేదాలున్న శంబీపూర్ రాజుపై రాధాకిషన్ రావు నిఘా ఉంచినట్లు తెలిసింది. జానారెడ్డి కుమారుడు రఘువీర్ రెడ్డి, వంశీకృష్ణ, కవ్వంపల్లి సత్యనారాయణల ఫోన్లు ట్యాప్ చేసినట్లు విచారణలో వెల్లడైంది. ఇంటర్నెట్ ప్రొటోకాల్ డేటా రికార్డ్‌ను ప్రణీత్ రావు విశ్లేషించారు. కాంగ్రెస్, బిజెపి నేతలకు ధన సహాయం చేసే వారిపై నిఘా ఉంచినట్లు రాధాకిషన్ రావు వెల్లడించారు. కడియం శ్రీహరి రాజయ్య మధ్య విభేదాలపై నిఘా ఉంచినట్లు వెల్లడించారు. రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, తీగల కృష్ణారెడ్డి, తీన్మార్ మల్లన్న, ఈటల, అర్వింద్ ఫోన్లను ట్యాప్ చేసినట్లు వెల్లడించారు. ఫోన్లు ట్యాప్ చేస్తున్నారని వాట్సాప్, స్నాప్ చాట్‌లో మాట్లాడిన వారి వివరాలను సేకరించినట్లు రాధాకిష న్ రావు వెల్లడించారు. ఎబిఎన్ -ఆంధ్రజ్యోతి సంస్థల ఎండి వేమూరి రాధాకృష్ణ ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు తేలింది. ఆర్కే ఫోన్‌ను కెసిఆర్ సర్కారే ట్యాప్ చేయించినట్లు రాధాకిషన్‌రావు వెల్లడించారు. దీంతో పాటు మరో ఛానల్ యజమాని ఫోన్ కూడా ట్యాపింగ్ జరిగిందని ఆయన వెల్లడించారు. గద్వాల, కోరుట్ల, మానకొండూరుకు చెందిన విపక్ష నేతలు, దీంతో పాటు కన్‌స్ట్రక్షన్, రియల్ ఎస్టేట్ కంపెనీలకు చెందిన పలువు రు వ్యాపారుల ఫోన్లు ట్యాపింగ్ చేసినట్లు రాధాకిషన్‌రావు వాంగ్మూలంలో చెప్పారని సమాచారం. నాటి మంత్రి హరీష్‌రావు ఆదేశాలతో ప్రణీత్ రావుతో డైరెక్ట్‌గా టచ్‌లోకి ఓ మీడియా యజమాని వెళ్లినట్లు తేలింది. మీడియా యజమాని ఇచ్చిన సమాచారంతో పలువురి ఫోన్లు కూడా ట్యాప్ చేసినట్లు ప్రణీత్‌రావు కుండ బద్ధలు కొట్టారు.